

ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	39.0	29.4
కావలి	38	28
ఆత్మకూరు	36	26
ఉదయగిరి	37	27
కందుకూరు	34	28

బదిలీల్లో సాంకేతిక సమస్యలు

- పాయింట్ల ప్రక్రియలో అవస్థలు
- హెచ్ఎంల స్థానచలనానికి 139 దరఖాస్తులు

నెల్లూరు(విద్య), మే 24 (ఆంధ్రజ్యోతి): బదిలీల్లో సాంకేతిక సమస్యల కారణంగా టీచర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఉపాధ్యాయ సంఘాలు గగ్గోలు పెడు తున్నాయి. రాష్ట్ర అధికారులను సంప్రదించినా సమస్యలు మాత్రం పరిష్కారం కాలేదు. రోజుకో సమస్యతో బదిలీల ప్రక్రియ గందరగోళంగా మారిందని, హెల్ప్‌లైన్ నెంబర్లు కూడా పనిచేయడం లేదని వారంటున్నారు.

● ఎడిట్ చేయబోతే మరో సమస్య

బదిలీ దరఖాస్తులో ఏదైనా సమస్యను ఎడిట్ చేయబోతే మరో కొత్త సమస్య ఉత్పన్నమవుతోందని ఉపాధ్యాయులు అంటున్నారు. పుట్టినతేదీ మార్పు, మిగులు ఉపాధ్యాయుల పాతస్టేషన్ పాయింట్లు జీరో అని చూపిస్తున్నాయం టున్నారు. అలాగే ఎస్‌జీటీలుగా పనిచేసి డీఎస్సీ ద్వారా ఎస్ఏలు ఎంపిక కాబడిన ఉపాధ్యాయులకు ఎస్‌జీటీ పాయింట్లు చూపించకపోవడంతో వారు తలలు పట్టుకుంటున్నారు. 8 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న వారికి సున్నా అని చూపించడంతో వారు కంగారు పడుతున్నారు. మరోవైపు ఆన్‌లైన్ దరఖాస్తు ముగింపు గడువు దగ్గర పడుతుండడం, మరోవైపు సర్వర్లు మొరాయిస్తుండడంతో ఏమి చేయాలో తెలియక టీచర్లు తికమకపడుతున్నారు..

● పాయింట్ల ప్రకియలో అవస్థలు

ఉపాధ్యాయుల ముఖ్యమైన స్టేషన్ పాయింట్లకు సీలింగ్ పెట్టారు. 8 ఏళ్లకు పాయింట్లు కేటాయించి,



మిగిలిన కాలాన్ని పరగణలోకి తీసుకోవడం లేదని వారంటున్నారు. దీనివల్ల కేటగిరి 3, 4లలో పనిచేసిన ఉపాధ్యాయులు ఈ సీలింగ్ విధానంతో తాము 6 నుంచి 8 పాయింట్లు కోల్పోతూ తీవ్రంగా నష్టపోతున్నామంటున్నారు. మరికొంతమంది ఉపాధ్యాయులు 2023లో బదిలీ అయ్యి ప్రస్తుత విద్యావిధానంతో హేతుబద్ధీకరణకు గురై 8 ఏళ్ల సీలింగ్ విధానంలో తిరిగి దూర ప్రాంతాలకు వెళ్లిపోతున్నామని ఆందోళన చెందుతున్నారు. అలాగే బదిలీలకు సంబంధించిన చట్టంలో ప్రిఫరెన్షియల్ కేటగిరి వారికి మోడల్ పాఠశాలలో రిజర్వ్ చేయాలని పేర్కొన్నారు. అయితే కొన్ని చోట్ల ఎంఈవోలు అవగాహన రాహిత్యంతో ఈ విధంగా రిజర్వ్ చేయకుండా పోస్టులు చూపించారు. దీంతో ఈ కేటగిరికి చెందిన ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. అలాగే కేటగిరి-2లో పనిచేసే కార్పొరేషన్, మున్సిపాలిటీ వారు ఎప్పటికీ ఆయా సమీప ప్రాంతాల్లోని పాఠశాలల్లోనే ఉంటున్నారని, ప్రభుత్వ, జడ్పీ యాజమాన్యాల్లో పనిచేసే వారు సుమారు 30 నుంచి వంద కిలోమీటర్ల పైగానే ప్రయాణం చేయాల్సి వస్తోందని వారు వాపోతున్నారు. కేటగిరి 3, 4 పాఠశాలల్లో పనిచేసే టీచర్లకు సీలింగ్ విధానం ఎత్తివేసి న్యాయం చేయాలని కోరుతున్నారు. గతంలో కూడా 2021, 2023లలో తొలుత సీలింగ్ విధాన ప్రవేశ పెట్టినా సంఘాల నేతల విజ్ఞప్తితో దీన్ని తొలగించారని గుర్తు చేస్తున్నారు.


● ప్రధానోపాధ్యాయుల బదిలీలకు 139 దరఖాస్తులు

ప్రధానోపాధ్యాయుల బదిలీలకు మొత్తం 139 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. హెచ్ఎంలకు క్లియర్ వేకన్సీలు 69, ఐదేళ్ల పూర్తయిన ఖాళీలు 45, రీఅపోర్షన్ ఖాళీలు 28 కలిపి మొత్తం 142 ఉన్నట్లు విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి. తొలుత వీటిని పూర్తి చేసిన అనంతరం మిగిలిన బదిలీలుంటాయని తెలిపారు. అలాగే ఎస్ఏలు ఆన్‌లైన్‌లో ప్రక్రియ కొనసాగుతుండగా తాజాగా ఎస్‌జీటీల దరఖాస్తుల కోలాహలం కూడా ప్రారంభమైంది. షెడ్యూల్ ప్రకారం శనివారం రాత్రికి స్కూల్ అసిస్టెంట్ల దరఖాస్తుల ప్రక్రియ ముగియనుంది. ఎస్ఏలకు సంబంధించి పాయింట్ల కేటాయింపులపై విస్తృత చర్చలు సాగుతున్నాయి.

ఆర్‌హెచ్ఆర్ ఆధునికీకరణకు మోక్షం

- రూ 5.25 కోట్ల మంజూరు
- త్వరలో పనుల ప్రారంభం

అనంతసాగరం మే 24 (ఆంధ్రజ్యోతి) సోమశిల జలాశయంలో ఆర్‌హెచ్ఆర్ పనులకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. దీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోని పనులు సమగ్రంగా పూర్తిచేసేలా రూ 5.25 కోట్లు మంజూరు చేయగా, త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. సోమశిల జలాశయానికి ఎగువ నుంచి వచ్చే కృష్ణ జలాల వాటాలో 15 టీఎంసీల నీటిని తెలుగుగంగకు విడుదల చేయాలి. ఈ కాలువ ద్వారా కండలేరుకు అక్కడి నుంచి సత్యసాయి కెనాల్ ద్వారా చెన్నై పుండీ ప్రాజెక్టుకు నీరు సరఫరా చేస్తారు. కాలక్రమేణా ఈ కాలువ తూములు మరమ్మతులకు గురికాగా రెగ్యులేటర్ గేట్లు ఎత్తాలన్నా.. దించాలన్నా సిబ్బందికి తలకు మించిన భారంగా ఉండేది. గేట్లు దించినా లీకేజీ నీరు ప్రవహిస్తూ ఉండేది. ఈ పరిస్థితులను మంత్రి ఆనం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా, స్పందించి నిధులు మంజూరు చేసింది. ఈవిషయంపై ఎస్ఈ వెంకట రమణారెడ్డిని వివరణ కోరగా త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



ఇంటర్ విద్యాశాఖలో బదిలీలు షురూ

- జిల్లాలో 200 మందికిపైగా స్థానచలనం
- నేడు తుది జాబితా విడుదల
- జూన్ 8లోగా ఉత్తర్వులు

నెల్లూరు(విద్య), మే 24 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యాశాఖలోని టీచింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగుల బదిలీలకు షెడ్యూల్ విడుదలైంది. ఆన్‌లైన్‌లో జూన్ 8వతేదీ వరకు బదిలీలు నిర్వహించనున్నారు. ఈ ఏడాది కొత్తగా ప్రిన్సిపాళ్లకు, జూనియర్ లెక్చరర్లకు, వారి పనితీరు ఆధారంగా పాయింట్లను కేటాయించనున్నారు. కళాశాలల్లో ఐదేళ్ల ఒకేచోట పనిచేసిన ప్రిన్సిపాళ్లు, జూనియర్ లెక్చరర్లు తప్పనిసరిగా బదిలీ కానున్నారు. రెండేళ్ల పూర్తయిన సిబ్బంది రిక్వస్ట్ బదిలీలకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ క్రమంలో జిల్లాలో 200మందికిపైగా స్థానచలనం కలగవచ్చు.

● పాయింట్ల కేటాయింపులు

బదిలీల్లో ప్రిన్సిపాళ్లకు, జూనియర్ లెక్చరర్లకు పాయింట్ల కేటాయించనున్నారు. 16శాతం హెచ్ఆర్ఏ ఉన్న కేటగిరి-ఏ ఉంటే ఏడాదికి 2 పాయింట్లు, 12శాతం హెచ్ఆర్ఏలో పని చేస్తున్న వారికి ఏడాదికి 4 పాయింట్లు, 10శాతం హెచ్ఆర్ఏలో పనిచేస్తున్న జేఎల్స్‌కు ఏడాదికి 6 పాయింట్లు, గిరిజన ప్రాంతాల్లో పనిచేసేవారికి ఏడాదికి 8 పాయింట్లు ఇస్తారు. వీరి పనితీరు ఆధారంగా బదిలీల్లో ప్రాధన్యత ఇవ్వనున్నారు. అలాగే జేఎల్స్‌కు ఆయా సబ్జెక్ట్‌లలో ఇంటర్ ఫలితాల్లో 40శాతం ఉత్తీర్ణులైతే ఎలాంటి పాయింట్లు ఉండవు. 41-60శాతం వరకు పాస్ అయితే రెండు పాయింట్లు, 61-80 శాతం వరకు 4 పాయింట్లు, 81-100 శాతానికి ఆరుపాయింట్లు కేటాయిస్తారు. అలాగే ప్రిన్సిపాళ్లకు పాయింట్లు కేటాయించనున్నారు. జిల్లాలో 23 ప్రభుత్వ కళాశాలలు ఉండగా అధ్యాపకులు, సిబ్బంది కలిపి 300 మందికి పైగా పనిచేస్తున్నారు. వీరిలో జూనియర్ లెక్చరర్లు 90 మంది ఉండగా ఇద్దరికి మాత్రం కచ్చితమైన బదిలీ జరగనుంది. అలాగే 28 మంది ప్రిన్సిపాళ్లలో 22 మంది రిక్వస్ట్ బదిలీ కోరుకుంటుండగా, నాన్ టీచింగ్ సిబ్బంది 60 మందిలో నలుగురు కచ్చితమైన బదిలీ కానున్నారు. ఐదుగురు రిక్వస్ బదిలీని కోరుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. రెగ్యులర్ బదిలీల తరువాత కాంట్రాక్ట్ లెక్చరర్లకు ఖాళీల ఆధారంగా పోస్టులను కేటాయిస్తామన్నారు.

● నేడు తుది జాబితా విడుదల

బదిలీల షెడ్యూల్ ప్రకారం ఆదివారం అభ్యంతరాలు పరిశీలన చేసి, తుది జాబితాను విడుదల చేస్తారు. ఈనెల 27 నుంచి 29వరకు ఖాళీల ప్రకటన, వెబ్ నమోదుకు అవకాశం కల్పించి 31న పోస్టింగ్‌ల కేటాయింపులు చేస్తారు. బదిలీలకు అర్హులైన అభ్యర్థుల జాబితాను ఇప్పటికే పోర్టల్‌లో ప్రకటించారు. అధికారులు ధ్రువీకరించిన జాబితాలో ఉన్న అభ్యర్థులు మాత్రమే ఆన్‌లైన్ ద్వారా తమ ఎంపికలను నమోదు చేయాల్సి ఉంది. పోస్టింగ్ ఆర్డర్స్‌ను కూడా ఆన్‌లైన్‌లోనే డౌన్‌లోడ్ చేసుకుని తమకు కేటాయించిన స్థానాల్లో చేరాలని అధికారులు తెలిపారు. వెబ్ కౌన్సెలింగ్ ద్వారా జరిగే ఈప్రక్రియలో బదిలీ ఉత్తర్వులు జూన్ 8లోగా జారీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 2025 మే 31నాటికి ఒకే కేంద్రంలో ఐదేళ్ల పనిచేస్తే తప్పనిసరిగా బదిలీ కావాల్సిందేనని, రెండేళ్ల పూర్తయిన వారు రిక్వస్ట్ బదిలీలకు దరఖాస్తు చేసుకోవచ్చు. 2027 మే 31వతేదీ లోగా ఉద్యోగ విరమణ చసేవారికి బదిలీల నుంచి మినహాయింపు ఇస్తున్నారు.

వెండి నందిపై కామాక్షితాయి విహారం



పెద్ద వెండి నందివాహనంపై గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చిన మల్లికార్జునస్వామి, కామాక్షితాయి

బుచ్చిరెడ్డిపాళెం,మే24:(ఆంధ్రజ్యోతి):సాక్షాత్తు పార్వతీ పరమేశ్వరులే శనివారం పెద్ద వెండి నంది వాహనంపై ఆదిదంపతులుగా కొలువు దీరి, గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలోని జొన్నవాడ ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మో త్సవాల్లో భాగంగా శనివారం వెండి నందివాహనసేవ వైభవంగా జరిగింది. గ్రామోత్సవంలో భక్తులు అడుగడు గునా స్వామి,అమ్మ వార్లకు కాయాకర్పూరం సమర్పించి, మొక్కులు తీర్చు కున్నారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి నివేద నలు సమర్పించుకున్నారు. మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవారు వెండి నందిపై శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు గ్రామో త్సవంలో ఊరే గుతూ భక్తులను కటాక్షించారు. భక్తులం దరికీ నిత్యాన్న దాన సదనంలో భోజన వసతి కల్పించారు. దాతల సహ కారంతో ఉచిత ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఈ కార్యక్రమాలను ఆలయ ఉత్సవ కమిటీ ఛైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, ఈవో ఏవీ. శ్రీనివాసులు రెడ్డి, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

అడల్ట్ బీసీజీలో మొదటి స్థానం

- క్షయ నివారణే ధ్యేయంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కృషి
- గత ఏడాది మే 16న పథకం ప్రారంభం
- జిల్లా లక్ష్యం 5.55 లక్షలు
- 80 శాతం వ్యాక్సిన్ ప్రక్రియ పూర్తి

నెల్లూరు (వైద్యం) మే 24 (ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధి నివారణే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించడంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. దీంతో జిల్లా అధికారులకు రాష్ట్ర ఉన్నతాధికారులు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ప్రాణాంతక క్షయ వ్యాధిని నివారించేందుకు కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ గత ఏడాది నూతన పథకాన్ని తీసుకు వచ్చాయి. ఇందులో భాగంగా 2025 చివరినాటికి క్షయను నివారించాలన్న ఉద్దేశ్యంతో 60 ఏళ్ల పైబడిన వారికి అడల్ట్ బీసీజీ (బేస్‌లెస్ కల్మిటి గూరిన్) వ్యాక్సిన్ వేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలో 2024 మే 16న బీసీజీ వ్యాక్సిన్ వృద్ధులకు వేయడాన్ని ప్రారంభించారు. జిల్లాకు 5,55,054 మందికి బీసీజీ వ్యాక్సిన్ వేయాలని నిర్ణయించగా, 4,43,517 మందికి వ్యాక్సిన్ వేశారు. రాష్ట్రంలోనే నెల్లూరు జిల్లా 80 శాతం మందికి వ్యాక్సిన్ వేసి మొదటిస్థానం సంపాదించింది. రెండో స్థానంలో కర్నూలు జిల్లా నిలిచింది.




నగరంలోని కోటమిట్ట యూపీహెచ్‌సీలో వ్యాక్సిన్ వేస్తున్న వైద్యసిబ్బంది (ఫైల్)

● హర్షాతిరేకాలు

జిల్లా వ్యాప్తంగా 52 పీహెచ్‌సీలతోపాటు 10 సీహెచ్‌సీలు, 28 యూపీహెచ్‌సీల్లో ఈ వ్యాక్సిన్ పక్రియ కొనసా గింది. జిల్లా వ్యాప్తంగా క్షయ వ్యాధిగ్రస్థులు 10వేల మందికిపైగా ఉన్నారు. అయితే వైద్య ఆరోగ్యశాఖ మాత్రం ప్రస్తుతం 1648 మంది మాత్రమే క్షయ వ్యాధిగ్రస్థులు ఉన్నట్లు పేర్కొంది. ఇందులో ప్రభుత్వ పరంగా 1050 మంది వైద్యచికిత్సలు పొందుతుండగా 592 మంది ప్రైవేట్ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నట్లు అధికారులు తెలిపారు. బీసీజీ వ్యాక్సిన్ వేసే గడువు ఈ నెల 16తో ముగిసింది. జిల్లాలో అడల్ట్ బీసీజీ వాక్సిన్ కార్యక్ర మం విజయవంతం కావటం పట్ల అధికారుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

తొలిస్థానం రావటం ఎంతో ఆనందం



వృద్ధులకు, క్షయ వ్యాధిగ్రస్థుల కుటుంబ సభ్యులకు వ్యాక్సిన్ వేయటంలో రాష్ట్రంలోనే జిల్లా మొదటి స్థానంలో నిలవటంపై ఎంతో ఆనందంగా ఉంది. ఇది గొప్ప అనుభూతి. దేశవ్యాప్తంగా మొదటిసారి ఈ కార్యక్రమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టాయి. ప్రస్తుతం ఈ పథకం ముగిసింది. ఈ వ్యాక్సిన్‌ను అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగానే వేశాం.

- డాక్టర్ ఖాదర్‌వలి,
జిల్లా క్షయ నివారణ అధికారి

మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు

నెల్లూరు(క్రైం), మే 24 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల నిర్మూలనకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఓ ఆనంద్, ఎస్పీ జీ కృష్ణకాంత్ ఆదేశించారు. శనివారం జిల్లాస్థాయి నార్కోటిక్స్ కో ఆర్డినేషన్ కమిటీ సమన్వయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పోలీసు కార్యాలయం నుంచి ఎస్పీ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీలు మాట్లాడుతూ మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే చర్యలపై వేసవి సెలవులు అనంతరం పాఠశాలలు, కళాశాలల్లో ఈగల్ క్లబ్‌ల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. మాదకద్రవ్యాల వినియోగం, విక్రయాలను అరికట్టేందుకు విద్యాసంస్థల గోడలపై ఈగల్ సెల్ టోల్‌ఫ్రీ నెంబర్ 1972ను ప్రదర్శించాలని, జిల్లా వ్యాప్తంగా ప్రధాన కూడళ్లలో హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఏఎస్పీ సీహెచ్ సౌజన్య మత్తు, మాదకద్రవ్యాల విక్రయాలు, అక్రమరవాణా కట్టడికి తీసుకుంటున్న చర్యలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులకు వివరించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో, డ్రగ్స్ కంట్రోల్ ఏడీ, డీఈవో, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

చదరంగం సాధనతో ఉజ్వల భవిత



శిక్షణను ప్రారంభిస్తున్న డీఎస్‌డీవో యతిరాజ్ తదితరులు

నెల్లూరు(విద్య), మే 24 (ఆంధ్రజ్యోతి) : నిత్యం చదరంగం క్రీడను సాధన చేసి పోటీల్లో రాణిస్తే ఉజ్వల భవిత ఉంటుందని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి (డీఎస్‌డీవో) ఆర్‌కే.యతిరాజ్ అన్నారు. రాష్ట్ర చెస్ అసోసియేషన్, శ్రీఆనంద్ వింగ్స్ చెస్ అకాడమీల సంయుక్త ఆధ్వర్యంలో ఎంజీబీ ఫెలిసిటీ మాల్‌లో శనివారం ఉచిత చెస్ శిక్షణను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అత్యాధునిక పద్ధతుల్లో చెస్ శిక్షణ అందిస్తున్న నేపథ్యంలో జిల్లాలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్ర చెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై.సుమన్ మాట్లాడుతూ జూన్ 2 వరకు ప్రతి రోజూ సాయంత్రం 6 నుంచి 8.30 గంటల వరకు 6 ఏళ్ల నుంచి 16 ఏళ్ల లోపు బాల, బాలికలకు ఉచిత శిక్షణ, పోటీలుంటాయన్నారు. బాల, బాలికలు తప్పకుండా శిక్షణకు హాజరు కావాలని తెలిపారు. మాల్ మేనేజర్ రాజశేఖర్ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో శ్రీ ఆనంద్ వింగ్స్ చెస్ అకాడమీ కోచ్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, సీనియర్ నేషనల్ ఆర్బిటర్ ఎ.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వింజమూరులో రెండిళ్లలో దొంగతనాలు



చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న సీఐ వెంకటరమణ

వింజమూరు, మే 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గాయత్రినగర్‌లో నివాసం ఉంటున్న చంద్రశేఖర్‌రెడ్డి, సోమిశెట్టి వెంకటేశ్వర్లు ఇళ్లలో శుక్రవారం అర్ధరాత్రి ఒకే రోజు దొంగతనాలు జరిగాయి. కలిగిరి సీఐ వెంకటరమణ సంఘటన స్థలానికి చేరుకుని దొంగతనం జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. బాధితులు మాట్లాడుతూ శుక్రవారం సాయంత్రం సోమిశెట్టి వెంకటేశ్వర్లు కుటుంబంతో జొన్నవాడ క్షేత్రానికి వెళ్లి తిరిగి శనివారం ఉదయం ఇంటికి వచ్చారు, ఆ సమయంలో ఇంటి తలుపులు పగులగొట్టి ఉండటంతో వారు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దేవుని గదిలో ఉన్న 30 సవర్ల బంగారం, రూ.13వేల నగదు దొంగతనానికి గురైనట్లు గుర్తించారు. అలాగే మద్దూరి చంద్రశేఖర్‌రెడ్డి ఇంటిలో కూడా దేవుని దగ్గర ఉన్న దీపారాధనకు సంబంధించి వెండి వస్తువులు దొంగలించబడ్డాయన్నారు. వాటి విలువ సుమారు రూ.10వేలు ఉంటుందని సీఐ తెలిపారు. క్లూస్ టీం ద్వారా వివరాలు సేకరించి త్వరలోనే దొంగలను పట్టుకుంటామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

అల్లూరులో చోరీ



ఘటనా స్థలంలో పరిశీలిస్తున్న ఎస్ఐ కిషోర్‌బాబు

అల్లూరు, మే 24 (ఆంధ్రజ్యోతి) : అల్లూరులో ఓ ఇంటిలో శనివారం చోరీ జరిగింది. ఎస్ఐ కిషోర్‌బాబు తెలిపిన వివరాల మేరకు.. అల్లూరు పట్టణ పరిధిలోని తూర్పు వీధిలో పురిణి నాంచారులు కుటుంబంతో సహా మూడు రోజుల క్రితం బంధువుల వివాహానికి హాజరయ్యారు. ఈ క్రమంలో నాంచారులు కుటుంబ సభ్యులను అక్కడే ఉంచి శనివారం సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా తాళాలు పగుల గొట్టి ఉండడాన్ని గమనించాడు. ఇంట్లోకి వెళ్లి చూడగా 400 గ్రాములు బరువు కలిగిన నాలుగు వెండి గిన్నెలు చోరీకి గురైనట్లు గమనించిన నాంచారులు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఘటనా స్థలానికి చేరుకొన్న ఎస్ఐ పరిస్థితిని పరిశీలించి క్లూస్ టీమ్ ద్వారా ఆధారాలను సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడులు

● రూ. 20 వేల స్వాధీనం

దగదర్తి (బిట్రగుంట), మే 24 (ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలం వెలిపోడు పంచాయతీ కామినేనిపాలెం గ్రామ శివారు అటవీ ప్రాంతంలో పేకాట స్థావరాలపై దగదర్తి పోలీసులు శనివారం సాయంత్రం దాడులు చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్సై జంపానికుమార్ మాట్లాడుతూ దాడులు నిర్వహించి నలుగురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి వద్ద 20 వేల 310 రూపాయలు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదుచేసి కోవూరు కోర్టుకు హాజరు పరచనున్నట్లు ఎస్సై తెలిపారు.

మహానాడుపై మంత్రుల సమీక్ష

● రికార్డు స్థాయిలో అభిమానులు వస్తారని వెల్లడి ● నేతలు, కార్యకర్తల తరలింపునకు వాహనాల ఏర్పాటు



మహానాడుపై సమీక్షిస్తున్న మంత్రులు ఆనం, నారాయణ

నెల్లూరు (వైద్యం) మే 24 (ఆంధ్రజ్యోతి): కడపలో ఈ నెల 27 నుంచి జరిగే టీడీపీ మహానాడుకు జిల్లా నుంచి భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలి రానున్నారని దేవదాయశాఖామంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, పురపాలక శాఖామంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. అందుకు తగ్గట్లు అన్నీ ఏర్పాట్లు చేపడుతున్నట్లు వివరించారు. శనివారం మంత్రి నారాయణ నివాసంలో ఆనం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలను చర్చించుకున్నారు. మహానాడుకు జిల్లా నుంచి 50 వేల మంది తరలి వస్తారని అంచనా వేశారు. అందుకు సంబంధించి రవాణా సౌకర్యాలపై సమీక్షించారు. అవసరమైన మేరకు ఆర్‌టీసీ బస్సులతోపాటు ప్రైవేట్ వాహనాలు సైతం అద్దెకు తీసుకోవాలని మంత్రులు నిర్ణయించారు. మహానాడుకు వచ్చే నేతలు, కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పక్కాప్రణాళిక రూపొందించాలని తీర్మానించారు. కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని మంత్రులు తెలియచేశారు. నేతలంతా కార్యకర్తలను సమీకరించి కడపకు తరలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి, టీడీపీ సీనియర్ నేతలు వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి చేజెర్ల వెంకటేశ్వరరెడ్డి, సోమశిల ప్రాజెక్టు చైర్మన్ కేశవ చౌదరి, టీడీపీ నేత బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జూన్ 4, 5తేదీలో పెన్షన్, జీపీఎఫ్ కేసుల అదాలత్

నెల్లూరు (హరనాథపురం) మే 24 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న పెన్షన్, జీపీఎఫ్ కేసులను సమీక్షించి పరిష్కరించడానికి జూన్ 4, 5తేదీల్లో నెల్లూరు, వింజమూరుల్లో పెన్షన్, జీపీఎఫ్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఆనంద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెన్షనర్లు, జీపీఎఫ్ చందాదారులకు సేవలను సకాలంలో సమర్థవంతంగా అందించడం కోసం జిల్లాలోని డీడీవోలకు విజయవాడ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ కార్యాలయం వారు అవగాహన కల్పిస్తారని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పెన్షన్ కేసులు, జీపీఎఫ్ కేసులను సమీక్షించి పరిష్కరించడానికి జూన్ 4న నెల్లూరులో, 5న వింజమూరులో పెన్షన్ అదాలత్ నిర్వహిస్తారన్నారు. ఇందుకుగాను జిల్లా ట్రెజరీ అధికారిణి నోడల్ అధికారిగా నియమిస్తున్నట్లు ఆయన వివరించారు. పెన్షనర్లు, జీపీఎఫ్ చందాదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

సోమశిల్లో 44.518 టీఎంసీల నిల్వ

అనంతసాగరం మే 24 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం నీటినిల్వ సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా శనివారం నాటికి 44.518 టీఎంసీలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. పెన్నాడెల్టాకు 3,130, ఉత్తర కాలువకు 300, దక్షిణ కాలువకు 50 క్యూసెక్కుల సరఫరా చేస్తున్నామన్నారు.

పేకాట స్థావరంపై దాడి

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), మే 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దిరెడ్డిపల్లి గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలాల్లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై శనివారం ఎస్ఐ రఘునాథ్ తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రూ.14 5,000ల నగదు, ఐదుమంది పేకాట రాయుళ్లతోపాటు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పేకాట నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

జీజీహెచ్‌లో సంస్కరణలు తీసుకు వస్తున్నాం

● కార్డియాలజిస్టు నియామకం ● త్వరలోనే క్యాథ్‌ల్యాబ్ ఏర్పాటు
● సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్



విలేకరులతో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దానాయక్ తదితరులు

నెల్లూరు (వైద్యం) మే 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి(జీజీహెచ్)లో రోగుల కోసం సంస్కరణలు తీసుకువస్తున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్ తెలిపారు. శనివారం ఆసుపత్రిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆసుపత్రిలో గుండె విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నామని, ఈ క్రమంలో గుండె వైద్యనిపుణులు డాక్టర్ మంజుల బాధ్యతలు స్వీకరించారన్నారని తెలిపారు. ఈ విభాగానికి క్యాథ్ ల్యాబ్‌ను కూడా వచ్చేలా కృషి చేస్తామని తెలిపారు. ఏడాది క్రితం కొన్ని సూపర్ స్పెషాలిటీ విభాగాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. న్యూరో ఫిజీషియన్‌కు డాక్టర్ అనుపమ కూడా బాధ్యతలు తీసుకున్నారని వివరించారు. ఆయా విభాగాలలో అవసరమైన ఆధునిక వైద్య పరికరాలు కూడా సమకూరుస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్ర, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు శ్రీనివాసులగౌడ్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

పోలీసు కుటుంబాల సంక్షేమానికి ప్రాధాన్యం



కళాశాల యజమానులతో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైం), మే 24 (ఆంధ్రజ్యోతి) : పోలీసు కుటుంబాల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని ఎస్పీ జీ. కృష్ణకాంత్ తెలిపారు. నగరంలోని పోలీసు కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో పోలీసు పిల్లలకు కార్పొరేట్ కళాశాలలో ఉచిత, రాయతీ అడ్మిషన్ల కోసం కళాశాలల యాజమాన్యాలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ పదవ తరగతిలో ఉత్తీర్ణులైన పోలీసు పిల్లల కోసం 11 కార్పొరేట్ కళాశాలలో ఉచిత, రాయతీ అడ్మిషన్స్‌పై యాజమాన్యంతో చర్చించామన్నారు. మంచి మార్కులు పొందిన పోలీసు పిల్లలకు పారదర్శకంగా సీట్లు కేటాయించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, ఎస్‌బీ సిఐ వెంకటేశ్వరరావు, వెల్ఫేర్ ఆర్ఐ రాజారావు, జిల్లా పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ గోదాము తనిఖీ

గడ్డకట్టిన 810 బస్తాలు



గడ్డకట్టిన సిమెంట్ బస్తాల వివరాలను నమోదు చేస్తున్న ఈఈ మాధవరావు

మనుబోలు, మే 24 (ఆంధ్రజ్యోతి): గోదాములో 810 సిమెంట్ బస్తాలు గడ్డకటినట్లు తనిఖీలో వెల్లడైంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను గోదాము తనిఖీ చేసేందుకు శనివారం కావలి హౌసింగ్ ఈఈ మాధవరావు మనుబోలు వచ్చారు. లక్ష్మీనరసింహపురంలో ఉన్న సిమెంట్ గోదామును ఆయన పరిశీలించి నివ్వెరపోయారు. రికార్డుల ప్రకారం 810 సిమెంట్ బస్తాలు ఉన్నాయి. అయితే ఒక్కటంటే ఒక్క బస్తా కూడా పనికిరాకుండా పోయాయని ఆయన తేల్చారు. ఇక స్టీల్ విషయంకు వస్తే రికార్డుల ప్రకారం సక్రమంగా ఉందని, ఇసుకకు సంబంధించి తనిఖీ చేయాల్సి ఉందని ఈఈ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మనుబోలు హౌసింగ్ ఏఈ. శరత్ ఉన్నారు. పేదల ఇళ్లకోసం ప్రభుత్వం అందిస్తున్న సిమెంట్ బస్తాలు ఇటు పేదలకు చెందకుండా, అటు ప్రభుత్వంకు తిరిగి పంపకపోవడంతో గోదాములో వృధాగా మారాయి. దాదాపుగా ప్రభుత్వంకు రూ. 1.62లక్షలు నష్టం వాటిల్లింది.

గిరిజనుల అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తాం : జడ్పీ సీఈవో



గిరిజన పిల్లలకు దుస్తులు అందిస్తున్న జడ్పీ సీఈవో విద్యారమ

మనుబోలు, మే 24 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తామని జడ్పీ సీఈవో విద్యారమ అన్నారు. మండలంలోని లక్ష్మీనరసింహపురంలోని చల్లా యానాదుల కాలనీకి ఆమె శనివారం విచ్చేశారు. పీపుల్స్ వెల్ఫేర్, చైల్డ్ ఎడ్యుకేషన్ ట్రస్టు ఆధ్వర్యంలో గిరిజన పిల్లలకు, పెద్దలకు దుస్తుల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అందరికీ ఆధార్ కార్డులు ఉండాలన్నారు. ప్రతి పిల్లవాడిని చదివించాలన్నారు. 50ఏళ్లు పైబడిన గిరిజనులకు పింఛన్‌లు ప్రభుత్వం అందిస్తుందన్నారు. ట్రస్టు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. కాలనీలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచేలా, అక్కడవారికి ఆధార్ కార్డులు, పిల్లలకు చదువు, వసతి ఇతరత్రా సేవలు అందించేందుకు సిద్ధంగా ఉండాలని ఆమె మండలస్థాయి అధికారులను ఆదేశించారు. అనంతరం కాలనీవద్ద మురుగునీరు పోయేందుకు కాలువ ఏర్పాటు చేయించాలని గిరిజన మహిళలు సీఈవోను కోరారు. మూడు రోజుల్లో ఏర్పాటు చేయించాలని ఎంపీడీవోని ఆదేశించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో జలజాక్షి, గ్రామీణ నీటిసరఫరా ఏఈ కసనానాయక్, సర్పంచు సునీల్‌నాయుడు, టీడీపీ నాయకులు కృష్ణమనాయుడు, కార్యదర్శి వెంకటేష్, ట్రస్టు అధ్యక్షులు డా.పోతుగుంట మల్లికార్జునరావు, సభ్యులు చిల్లకూరు అరుణ్‌బాబు, యేసుదాస్, పోతుగుంట విజయమ్మలు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల రైలు పట్టాలపై మృతదేహాలు

బిట్రగుంట, మే 24 (ఆంధ్రజ్యోతి): బిట్రగుంట రైల్వేసెక్షన్ పరిధిలోని వేర్వేరు చోట్ల రైలు పట్టాలపై స్త్రీ, పురుష మృతదేహాలు పడి ఉన్నట్లు కావలి జీఆర్పీ ఎస్సై రమాదేవి శనివారం తెలిపారు. ఆమె వివరాల మేరకు నెల్లూరు స్టోన్‌హౌస్ పేట లక్ష్మీపురానికి చెందిన దేవీమంజుల (50) ఆమె కుమార్తెతో కలిసి జీటీ ఎక్స్‌ప్రెస్‌లో శుక్రవారం ఢిల్లీ నుంచి నెల్లూరుకు బయలుదేరారు. కావలి రైల్వేస్టేషన్ దాటిన తరువాత శనివారం అర్ధరాత్రి నుంచి కనిపించక పోవడంతో ఆమె కుమార్తె నెల్లూరు జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ముమ్మర గాలింపు చర్యలు చేట్టంతోపాటు రైల్వే సిబ్బందిని అప్రమత్తం చేశారు. చౌదరిపాలెం ఎల్సీగేట్ 219/1, 218/29 ఎగువ, దిగువ రైలు పట్టాల మధ్య మహిళ మృతదేహం ఉన్నట్లు నైట్‌పెట్రోల్ కీమెన్ ద్వారా తెలిసిందన్నారు. మృతురాలు ధరించి ఉన్న దుస్తులను బట్టి దేవీమంజులగా గుర్తించామని తెలిపారు. మృతదేహాన్ని కావలి ఏరియా వైద్యశాలకు తరలించి శవపంచనామ అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు.అలాగే తలమంచి, కొడవలూరు రైల్వే స్టేషన్ల మధ్య మస్తాన్ (17) మృతదేహం గుర్తించామన్నారు. తోటి ప్రయాణికుల వివరాల మేరకు.. చిక్కుమెంట్రుకలకు బెల్లాన్లు, అమ్ముకునే వారు కావలి రైల్వేస్టేషన్లో మధ్యాహ్నం పాసింజర్ రైలు ఎక్కారని డోర్ వద్ద కూర్చో నుండగా రైలు కుదుపులకు తలమంచి - కొడవలూరు స్టేషన్ల మధ్య 187/21-23 కిలోమీటర్ల వద్ద ప్రమాద వశాత్తు పడి మృతి చెందాడని తెలిసిందన్నారు. కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై తెలిపారు.

ఇందిరమ్మ కాలనీలో మోటారు బైక్ కలకలం

కావలి రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముసునూరు ఇందిరమ్మ కాలనీలోని బీఈడీ కళాశాల సమీపంలో శుక్రవారం నుంచి నిలిపి ఉన్న మోటారు బైక్ ఆ ప్రాంత వాసుల్లో కలకలం రేపుతోంది. నిరుపయోగంగా ఉన్న గృహాల దగ్గర గుర్తుతెలియని వ్యక్తులు వదిలి వెళ్లిన మోటారుబైక్‌కు నెంబరు ప్లేటు తొలగించి ఉండటం రాత్రి, పగలు అక్కడే ఉండటం తో స్థానిక కాలనీ వాసులు భయాందోళన చెందుతున్నారు. నెంబరు ప్లేట్లు లేని ఆ బైక్‌ను ఎక్కడైనా దొంగిలించి ఇక్కడ వదిలిపెట్టారా, లేక ఏదైనా అసాంఘిక కార్యక్రమాలకు వినియోగించి వదిలి వెళ్లారా అన్న కోణంలో స్థానికులు బిక్కుబిక్కు మంటూ గడుపుతున్నారు. పోలీసులు స్పందించి వాహనాన్ని స్వాధీనపర్చుకుని స్థానికుల్లో నెలకొన్న భయాన్ని తొలగించాలని పలువురు కోరుతున్నారు.



కుమార్తె మృతదేహంపై పడి రోదిస్తున్న తండ్రి నాయబ్ రసూల్

కారు ఢీకొని బాలిక దుర్మరణం

రోడ్డు దాటుతుండగా దుర్ఘటన ● కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు



ప్రమాదానికి కారణమైన కారు

సంగం, మే 24 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని శనివారం ఓ బాలిక మృతి చెందింది. దీంతో ఆమె తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సంగం మండలం తలుపూరుపాడుకి చెందిన షేక్ నాయబ్ రసూల్-దిల్షాద్ దంపతులకు బాలిక ఆయేషా (6). ఒక బాబు ఉన్నారు. నాయబ్ రసూల్ తల్లిదండ్రులు ప్రతి ఏటా కొరిమెర్ల వద్ద మామిడి తోట లీజుకు తీసుకుంటారు. ఈ ఏడాది నాయబ్ రసూల్ కూడ లీజుకు తీసుకున్నాడు. తల్లిదండ్రులు తోటకు ఎదురుగా రోడ్డు పక్కన పందిరి వేసుకుని మామిడి పండ్లు విక్రయిస్తున్నారు. వారికి కొంత దూరంలో నాయబ్ రసూల్ భార్య దిల్షాద్‌కు శనివారమే పందిరి వేసి మామిడికాయలు అమ్మడం మొదలు పెట్టారు. ఈ క్రమంలో తండ్రితోబాటు ఇంటి నుంచి వచ్చిన కుమార్తె అయేషా తల్లి వద్దకు వెళ్లి తోటలోకి వెళ్లేందుకు రహదారి దాటుతుండగా సంగం నుంచి కలిగిరి వైపు వేగంగా వెళ్తున్న కారు ఢీకొట్టింది. దీంతో బాలిక సుమారు 10 మీటర్ల దూరంలో ఎగిరి పడింది. వెంటనే తల్లిదండ్రులు చిన్నారిని సంగం పీహెచ్‌సీకి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. తమ చిన్నారి ఇక లేదని తెలుసుకున్న ఆ తల్లిదండ్రులు దుఃఖ సాగరంలో మునిగిపోయారు. వైద్యశాల ప్రాంగణంలో వారి ఆర్తనాదాలు మిన్నంటాయి. పోలీసులు ప్రమాదానికి కారణమైన కారును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వీడిన హత్యకేసు మిస్టరీ

● ప్రేమించిన అమ్మాయి దక్కదనే కక్షతోనే హత్య
● ఏడుగురు నిందితుల అరెస్టు



కేసు వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ వేణుగోపాల్

రాపూరు, మే 24 (ఆంధ్రజ్యోతి) : ఎనిమిది రోజుల క్రితం హత్యకు గురైన షఫీ హత్య కేసును పోలీసులు ఛేదించారు.ఈ కేసులో మొత్తం ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకొని శనివారం మీడియా ముందు ప్రవేశ పెట్టారు. ఈ సందర్భంగా కేసు వివరాలను ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ విలేకరులకు వివరించారు. రాపూరుకి చెందిన సంగ్రపల్లి మస్తాన్ మృతుడు షఫీ కుమార్తెను ప్రేమించాడు. కానీ షఫీ కూతురుకి బంధువులతో వివాహం నిశ్చయం అయింది. దీన్ని సహించలేని మస్తాన్ అడ్డుగా ఉన్న ఆమె తండ్రిని హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ విషయమై గూడూరులో ఉండే తన స్నేహితుడు దాసరి క్రాంతితో మాట్లాడి హత్యకు పథకాన్ని రూపొందించాడు. దాసరి క్రాంతి ఈ హత్యా పథకాన్ని అమలు చేయడం కోసం తన స్నేహితులు సుదర్శన్ సన్ని, మొగిలిగుంట్ల రాజశేఖర్, తలారి సాయిప్రకాశ్, మలపాటి వెంకటసాయి, అలపాకుర తరుణ్‌ను తన వద్దకు రప్పించి హత్యా పథకాన్ని వివరించాడు. మలపాటి వెంకటసాయి ద్వారా బాడుగ కారును ఏర్పాటు చేయించి, దానికి నకిలీ నెంబర్ ప్లేటు తగిలించి, వారికి అవసరం అయిన ఖర్చులు సంగ్రపల్లి మస్తాన్ ద్వారా సమకూర్చాడు. దాసరి క్రాంతి హత్య చేయడం కోసం తలారి సాయి ప్రకాశ్ కొబ్బరికాయలు కొట్టే కత్తిని అప్పగించాడు. ఈనెల 16న రాత్రి నకిలీ నెంబర్ ప్లేటుతో ఉన్న కారులో మృతుడి దుకాణం చుట్టూ రెక్కి నిర్వహించారు. కాపు కాసి షఫీ దుకాణం మూసి వేసి ఇంటికి వెళ్తున్న సమయంలో, నిందితులు షఫీని ఆపి కారులో నుంచి ఒకరు షఫీతో మాట్లాడుతుండగా వెనుక నుంచి మొగిలిగుంట్ల రాజశేఖర్ బలవంతంగా కారులోకి తోశాడు. అనంతరం కొట్టుకుంటూ తీసుకెళ్లి తాతిపల్లి గ్రామ శివార్లలో నిర్మానుష్య ప్రదేశంలో కిరాతకంగా హత్య చేశారు. అనంతరం నిందితులు కారులో అక్కడి నుంచి పరారయ్యారని డీఎస్పీ తెలిపారు. అరెస్టు చేసిన నిందితులను జిల్లా జైలుకు రిమాండ్‌కు పంపామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో రాపూరు సీఐ ఎన్. సత్యనారాయణ, కండలేరు ఎస్ఐ రామకృష్ణ, రాపూరు ఎస్ఐ ఎంవీ.రాజేష్, సైదాపురం ఎస్ఐ ఎస్.క్రాంతి కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల వలలో బద్దెవోలు యువకుడు

● రూ.6లక్షలు పోగొట్టుకున్న వైనం ● పోలీసులకు ఫిర్యాదు

మనుబోలు, మే 24 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల వలలో పడి ఓ యువకుడు రూ.6లక్షలు పోగొట్టుకున్న వైనం శనివారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని బద్దెవోలు గ్రామానికి చెందిన పామూరు వరప్రసాద్ బిటెక్ చదివాడు. ఒక సబ్జెక్టులో ఫెయిల్ కావడంతో పైచదువులకు వెళ్లలేక, ఉద్యోగం రాక ఖాళీగా ఉన్నాడు. ఈనేపథ్యంలో ఈనెల 19న తన ఫోన్‌కు వాట్సాప్ ద్వారా వచ్చిన మెసేజ్ చూసి మురిసి పోయాడు. అదనంగా డబ్బులు వస్తాయని ఆశపడ్డాడు. ముందుగా సైబర్ నేరగాళ్ళు ఇచ్చిన టాస్క్‌లు ఆడడం ప్రారంభించాడు. తొలుత రూ. 205 వరప్రసాద్ ఖాతాలో వేశారు. తరువాత రూ. 500 కడితే రూ.1300 వస్తాయని చెప్పారు. తరువాత రూ.3వేలు, రూ.5వేలు, ఇలా వరప్రసాద్ ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు పంపిన ఖాతాలకు పంపాడు. దీంతో రూ. 23వేలు వరకు తన ఖాతాకు రావడంతో నమ్మేశాడు. వేలు పంపితే లక్షలు ఇస్తామని చెప్పడంతో వరప్రసాద్ తన తల్లి ఖాతానుంచి డబ్బులు తన ఖాతాకు వేసుకుని అక్కడినుంచి సైబర్ నేరగాళ్ల ఖాతాలకు పంపాడు. తరువాత నుంచి డబ్బులు వెనక్కి రాకపోవడంతో ఎందుకు డబ్బులు ఇవ్వడం లేదని ప్రశ్నించాడు. ఇంకో లక్ష పంపు, మరో రూ. 50వేలు పంపు ఇస్తామని చెప్పడంతో రూ.6.20 లక్షల వరకు వరప్రసాద్ తన ఖాతా నుంచి పంపేశాడు. కాగా, ఎంతకీ డబ్బులు రాకపోవడంతో సైబర్ నేరగాళ్లను ప్రశ్నించగా మొత్తం డబ్బులు ఇవ్వాలంటే మరో రూ.4లక్షలు పంపాలని చెప్పడంతో తాను మోసపోయినట్లు గ్రహించి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పాటు పోలీసులకు శనివారం ఫిర్యాదుచేసి తనకు న్యాయం చేయాలని వరప్రసాద్ వేడుకున్నాడు.

చికెన్ వ్యర్థాల వాహనం పట్టివేత

సంగం, మే 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముంబాయి జాతీయ రహదారి వైపు వెళ్తున్న చికెన్ వ్యర్థాల వాహనాన్ని శనివారం ఉదయం పోలీసులు పట్టుకున్నారు. బెంగళూరు నుంచి సుమారు 12 డ్రమ్ముల్లో చికెన్ వ్యర్థాలను చేపల చెరువులకు తరలిస్తున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం మత్స్యశాఖ, రెవెన్యూ అధికారి ఆధ్వర్యంలో చికెన్ వ్యర్థాలను కలిగిరి రహదారి కొండ దిగువ ప్రాంతంలో గుంతల్లో వేసి పూడ్చి వేశారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	133
స్కిన్ చికెన్	240
స్కిన్‌లెస్	264

కోడిగుడ్ల ధర (100): 530

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9260
వెండి కిలో ధర	రూ.100,600
వెండి ఒక గ్రాము	రూ.103.60

భక్తిశ్రద్ధలతో ప్రదోషకాల పూజలు

నెల్లూరు(సాంస్కృతికం), మే 24(ఆంధ్రజ్యోతి): మూలాపేట భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరాలయంలో శనివారం సాయంత్రం శని ప్రదోషం సందర్భంగా ప్రదోషకాల పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. నందీశ్వరస్వామికి విశేష అభిషేకాలు, అలంకారం జరిగింది. అనంతరం మూలస్థానేశ్వరస్వామికి పాలాభిషేకాలు, పంచామృతాభిషేకాలు, విశేష ద్రవ్యాలతో అభిషేకాలు జరిగాయి. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలను ఆలయ ఈవో అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి, అర్చకులు పర్యవేక్షించారు. అలాగే నగరంలోని అన్ని శివాలయాల్లో ప్రదోషకాల పూజలు కన్నుల పండువగా జరిగాయి.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైం), మే 24(ఆంధ్రజ్యోతి) : ఆత్మహత్యాయత్నానికి పాల్పడి వైద్యశాలలో చికిత్స పొందుతుండిన వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు... వేదాయపాలెం చైతన్యపురికాలనీకిలో వెంకటస్వామిరెడ్డి(51), రమాదేవి దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి ఇద్దరు కుమారులు. వెంకటస్వామిరెడ్డి కాంట్రాక్టు పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆయన ఈనెల 20వ తేదీన బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లారు. అక్కడ ఏమి జరిగిందో తెలియదు కానీ అదే రోజు రాత్రి ఆయన తన భార్యకు ఫోను చేసి సోమశేఖరపురంలోని వైఎంసీఏ మైదానంలో పురుగుల మందు తాగుతున్నాని చెప్పాడు. ఆమె విషయాన్ని చిన్నకుమారుడు తరుణ్‌కుమార్‌కు తెలియజేశారు. కుమారుడు హుటాహుటిన వైఎంసీఏ మైదానం వద్దకు చేరుకొని అపస్మారక స్థితిలో ఉన్న తండ్రిని చికిత్స నిమిత్తం సమీపంలోని జయభారత్ వైద్యశాలలో చేర్పించారు. 21వ తేది మెరుగైన వైద్యం కోసం అపోలో వైద్యశాలలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. ఈ మేరకు మృతుడు భార్య రమాదేవి చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ అబ్దుల్ రజాక్ వైద్యశాలకు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురికి తరలించారు. ఎస్‌ఐ కేసు నమోదు చేసి ఆత్మహత్యకు గల కారణాలు తెలుసుకుంటున్నారు.

విద్యార్థులకు అభినందన

నెల్లూరు(విద్య), మే 24(ఆంధ్రజ్యోతి): నారాయణ విద్యాసంస్థల్లో ఉత్తమ విద్యా ప్రమాణాలతో విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తున్నారని విద్యాసంస్థల డీన్ రాయుడు అన్నారు. నగరంలోని ధనలక్ష్మీపురం నారాయణ పాఠశాలలో జరిగిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. టెన్త్ వార్షిక పరీక్షల్లో రెసిడెన్షియల్ బాలికలు, బాలురు హాస్టల్స్, సీఓఎస్ హాస్టల్స్ విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారన్నారు. ఊహప్రీతి రాష్ట్రస్థాయిలో 599 మార్కులతో అగ్రస్థానంలో నిలిచిందన్నారు. అలాగే ముగ్గురు 595 , 21 మంది 590, 93 మంది 580, 232 మంది 550కి పైగా, 359 మంది 500 మార్కులకు పైగా సాధించారన్నారు. అనంతరం విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం శ్రీనివాసులరెడ్డి, ప్రిన్సిపాల్స్ నాగమణి, కిరణ్, మధుసూదనరెడ్డి, కోఆర్డినేటర్ రాఘవేంద్రరావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పేపర్ క్రాఫ్ట్‌లో శిక్షణ

నెల్లూరు(సాంస్కృతికం), మే 24(ఆంధ్రజ్యోతి) : నగరంలోని జిల్లా గ్రంథాలయ సంస్థలో వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా శనివారం విద్యార్థులకు పేపర్‌తో బొమ్మలు తయారు చేయడంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రజాసైన్స్ వేదిక నెల్లూరు అధ్యక్షుడు ఎం.సతీష్‌కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ డిప్యూటీ లైబ్రేరియన్ ప్రసాద్, సిబ్బంది కృష్ణయ్య, జితేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కోసం కష్టపడే వారికి ప్రాధాన్యత

● పదవులను అలంకార ప్రాయంగా భావించొద్దు ● పురపాలక శాఖామంత్రి పొంగూరు నారాయణ

నెల్లూరు(వైద్యం) మే 24(ఆంధ్రజ్యోతి) : ప్రజలతో సత్సంబంధాలు కలిగి తెలుగుదేశం పార్టీ కోసం కష్టపడే వారికి పదవుల్లో ప్రాధాన్యత ఉంటుందని పురపాలక శాఖామంత్రి పొంగూరు నారాయణ స్పష్టం చేశారు. నగరంలోని నారాయణ వైద్య కళాశాలలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో టీడీపీ డివిజన్ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, పార్టీ ముఖ్య నేతలతో శనివారం మంత్రి సమీక్ష నిర్వహించారు. నెల్లూరు సిటీ పరిధిలోని ఐదు దేవాలయాల కమిటీ ఛైర్మన్‌లు, పాలక మండలి సభ్యుల ఎంపికపై కసరత్తు చేశారు. అందరి అభిప్రాయాలు తీసుకుని పారదర్శకంగా పదవుల్లో ప్రాధాన్యత ఇస్తామని మంత్రి హామీ ఇచ్చారు. పదవుల కేటాయింపులో మహిళలకు సముచిత స్థానం కల్పిస్తామన్నారు. పదవులు వచ్చిన వారు అది అలంకార ప్రాయంగా కాకుండా బాధ్యతగా స్వీకరించాలని వెల్లడించారు. ఈ సమీక్షలో డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్, టీడీపీ సీనియర్ నేత వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, మాజీ జడ్పీటీసీ విజేతరెడ్డి, టీడీపీ బీసీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు, టీడీపీ నగర అధ్యక్షుడు మామిడాల మధు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి పొంగూరు నారాయణ

72 గంటల్లో భవన నిర్మాణాలకు అనుమతులు

నెల్లూరు(సిటీ) : నెల్లూరులో నూతన భవనాలు నిర్మించుకునే వారికి దరఖాస్తు చేసుకున్న 72 గంటల్లో పురపాలక శాఖ నుంచి అనుమతులు అందుతాయని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. శనివారం కార్పొరేషన్ కార్యాలయంలో ప్లానింగ్ శాఖకు చెందిన డైరెక్టర్ విద్యులతతో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని పత్రాలు సరిగ్గా ఉంటే 72 గంటల్లో అనుమతులు లభిస్తాయని తెలిపారు. పత్రాలు సరిలేకుండా అధికారులే దరఖాస్తుదారుని ఇంటి వద్దకెళ్లి వాటిని సరిచేసి అక్కడికక్కడే అనుమతులు మంజూరు చేసే విధంగా నూతన విధానాన్ని తీసుకువస్తున్నామన్నారు. ఈ ప్రక్రియను నెల్లూరు కార్పొరేషన్ నుంచి శ్రీకారం చుట్టనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నందన్, సీపీ హిమబిందులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు వినూత్న చర్యలు

● ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైం), మే 24 (ఆంధ్ర జ్యోతి) : సాంకేతికతతో అసాంఘిక, చట్ట వ్యతరేక కార్యకలాపాలు, నేరాల నియంత్రణకు వినూత్న చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ జీ. కృష్ణకాంత్ తెలిపారు. నగరంలోని రామకోటయ్య నగర్, డైకాస్‌రోడ్డు, కొత్తూరు, పద్మావతి సెంటర్, చంద్రబాబునగర్, వైఎస్ఆర్ నగర్, కార్మికనగర్ తదితర శివారు ప్రాంతా లను డ్రోన్ కెమెరాల ద్వారా ఎస్పీ శనివారం స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ డ్రోన్ నిఘా ద్వారా అసాంఘిక కార్యకలాపాలు, అల్లరిమూకలను జల్లెడ పట్టడం జరుగుతుందన్నారు. నేర నియంత్రణే లక్ష్యంగా క్రైమ్‌ప్రోన్ ఏరియాలపై డ్రోన్ కెమెరాలతో నిరంతరం నిఘా ఉంటుందన్నారు. ఓవర్ స్పీడ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, త్రిబుల్ రైడింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్‌లపై ప్రత్యేక దృష్టి సారించి స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నామన్నారు. నేరాలు జరిగేందుకు ఆస్కారం ఉన్న నిశితమైన ప్రదేశాలను ముందుగా గుర్తించి ఆయా ప్రాంతాలపై డ్రోన్ పంపి నిఘా ఏర్పాటు చేశామన్నారు.


డ్రోన్ కెమెరాల పుటేజ్‌లను పరిశీలిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

27 నుంచి సువార్త మహాసభలు

నెల్లూరు(సాంస్కృతికం), మే 24(ఆంధ్రజ్యోతి) : నగరంలోని వీఆర్ హైస్కూల్‌లో ఈనెల 27, 28, 29వ తేదీలలో సువార్త మహాసభలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఎం.బర్నబాస్, టి.కుమార్, జోసఫ్‌బాబులు తెలిపారు. శనివారం డౌనీహాల్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈ సువార్త మహాసభలు జేటీజీ మినిస్ట్రీ ఆధ్వర్యంలో జరుగుతాయని తెలిపారు. జిల్లాలోని క్రైస్తవ సంఘాలు, ప్రజలందరూ పాల్గొని దేవుని ఆశీస్సులు అందుకోవాలని కోరారు. ఈ సభలకు జేటీసీ మినిస్ట్రీస్ నుంచి ముఖ్య ప్రసంగీకులు జె.దావీదు, పాస్టర్ డి.లారెన్స్ దావీదులైన దేవుని సువార్తను అందిస్తారని తెలిపారు. అనంతరం సువార్త పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సువార్తికులు జె.దావీదు, పాస్టర్ హనోక్, ప్రభుదాస్, భాస్కరయ్య, బ్రదర్ రాజేష్, స్వరూప్, ఆశిష్, పాల్, పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లోకి అర్ధరాత్రి ఆ కారేందుకొచ్చింది?

● మాగుంటలేఅవుట్ వైపు ఎందుకెళ్లింది

నెల్లూరు(సిటీ), మే 24,(ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయంలో ఓ ఉన్నతాధికారికి చెందిన కారు అర్ధరాత్రి హల్‌చల్ చేసిన ఘటన తాజాగా ఉత్కంఠను రేపుతోంది. విశ్వసనీయ సమాచారం మేరకు.. కార్పొరేషన్‌లో ప్రధాన అధికారికి చెందిన ప్రభుత్వ కారు నాలుగు రోజుల క్రితం అర్ధరాత్రి 12.45 గంటల సమయంలో కార్పొరేషన్ కార్యాలయంలోకి వచ్చినట్లు సమాచారం. ఆ సమయంలో కొందరు వ్యక్తులు అక్కడ మద్యం సేవిస్తుండగా దానిని చూసి అవాక్కయ్యారు. ఆ కారులో నుంచి బయటకు దిగిన వ్యక్తి కొంత సమయం తరువాత కారును తీసుకుని బయల్దేరాడు. దానిని వెంబడించిన డ్రైవర్లు మాగుంట లేఅవుట్‌లోని అండర్‌బ్రిడ్జి వరకు వెళ్లారు. అక్కడ నుంచి వెనుతిరగడంతో కారు గమ్యం తెలియలేదు. కానీ అర్ధరాత్రి అధికారి కారు కార్యాలయానికి దేనికి వచ్చింది..? అక్కడ నుంచి మాగుంట లేఅవుట్ వైపు ఎందుకు వెళ్లింది..? అన్నది చర్చనీయాంశంగా మారింది. ఎన్ఎంసీలోని సీసీ కెమెరాలను పరిశీలిస్తే అసలు విషయం బయటకు వస్తుందని కార్యాలయ ఉద్యోగులు అంటున్నారు.

ఆధునికీకరణ పనుల్లో జాప్యం తగదు

● నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి

నెల్లూరురూరల్, మే 24(ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని పొదలకూరురోడ్డు ఆధునీకరణ పనుల్లో ఎక్కడ జాప్యం తలెత్తకూడదని నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అధికారులకు సూచించారు. శనివారం నెల్లూరులోని తన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే డివైడర్ పనులు పూర్తయ్యాయని తెలిపారు. లైటింగ్ స్తంభాలు ఏర్పాటు చేయడం జరిగిందని వెల్లడించారు. చిన్న చిన్న పనులన్నింటిని వేగంగా పూర్తి చేసి వీలైనంత త్వరగా ప్రజలకు దగ్గర చేయాలని స్పష్టం చేశారు. ఈ రహదారి వల్ల అనేక ప్రాంతాలకు వెళ్లేవారికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఇక్కడ చేపట్టే సుందరీకరణ పనులు నెల్లూరుకే అందాన్ని తెస్తాయన్నారు.

స్వీట్ దుకాణానికి రూ.50 వేల జరిమానా

● ఎన్ఎంసీ కమిషనర్ నందన్

నెల్లూరు(సిటీ), మే 24(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు ట్రంకురోడ్డులో డ్రైనేజీ కాలువపై శాశ్వత నిర్మాణం చేపట్టిన ఓ స్వీట్ దుకాణానికి రూ.50 వేల జరిమాన విధించాలని ఎన్ఎంసీ కమిషనర్ నందన్ అధికారులను ఆదేశించారు. శనివారం అక్కడ కాలువ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా శాశ్వత నిర్మాణం చేపట్టడంతో ఆక్షేపించిన ఆయన ఈ మేరకు జరిమానా విధించారు. ఈ పనులు పూర్తయ్యే వరకు ఈ ప్రాంతంలో ట్రాఫిక్ మళ్లించాలని పోలీసులకు సూచించారు. అనంతరం ఎన్టీఆర్ నగర్, రాయపాళెం హరిజనవాడ ప్రాంతాల్లో పర్యటించి రోడ్లను ఆక్రమించి భవనాలు నిర్మిస్తున్న వారిని గుర్తించి నోటీసులు జారీ చేయాలని స్థానిక అధికారులను ఆదేశించారు. అనంతరం ఎన్ఎంసీ కార్యాలయంలో యువ ఇంజనీర్లతో సమీక్ష నిర్వహించి ఎల్టీపీలుగా శిక్షణ అందిస్తామని తెలిపారు.


దుకాణాల వద్ద డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ నందన్

క్రీడాకారులకు పౌష్టికాహారం పంపిణీ

నెల్లూరు(విద్య), మే 24(ఆంధ్రజ్యోతి) : ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో శనివారం వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినూ త్న రీతిలో క్రీడాకారులకు ఉచిత పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. సాధారణ పౌష్టికాహారంతో పాటు క్రీడాకారులందరికీ విజిటేబుల్ రైస్, వడ ప్రత్యేకంగా అందచేశారు. ఈ కార్యక్రమంలో దాత వై.విష్ణువర్ధన్‌రెడ్డి, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతల అమరేంద్రరెడ్డి, కార్యదర్శి పొన్నం రవిచంద్ర, కోశాధికారి జీకే గోపీనాథ్, సభ్యులు చంద్రమౌళి, గఫార్, గోపాల్‌రెడ్డి, సుబ్బరాజు, స్వర్ణ రమేష్, రాజారమేష్, సుబ్బరామిరెడ్డి, ఖలీల్‌బేగ్ పాల్గొన్నారు.

నేడు నగరంలో విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(జడ్పీ), మే 24(ఆంధ్రజ్యోతి): నగరంలోని మహాత్మగాంధీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని డీకేడ బ్ల్యూ ఫీడర్ నందు మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ ఎం.శ్రీధర్ ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో ప్రశాంతి నగర్, అంబేద్కర్ నగర్, డీకేడబ్ల్యూ కాలేజ్, కేవీఆర్ పెట్రో ల్ బంక్, బట్వాడిపాళెం సర్కిల్, నీలగిరి సంగం పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే డీఎస్ఆర్ సబ్‌స్టేషన్ పరిధిలో నేతాజీ నగర్, పొదలకూరు రోడ్డు పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 6 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నా రు. తెలుగుగంగ సబ్‌స్టేషన్ పరిధిలోని నేతాజీనగర్, వెంగళరావునగర్, ఎస్‌సీసీ కాలనీ, శివాజీ నగర్, డైకస్‌రోడ్డు, ఎన్టీటీ కాలనీ, ఇందిరా గాంధీ నగర్, సంజయ్‌గాంధీ నగర్, హౌసింగ్ బోర్డు కాలనీ పరిసర ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి మ ధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉం డదన్నారు. ఏకే నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని కేశవుల నగర్, న్యూ మిలిటరీ కాలనీ, చైతన్యపురి పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, డైకస్‌రోడ్డు సబ్‌స్టేషన్ పరిధిలోని రమేష్‌రెడ్డి నగర్, రైతుబజార్, ఫతేఖాన్ పేట, శివాలయం గుడి ఏరియా, అలంకార్ సెంటర్, మూలపేట పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు.

సిద్ధేశ్వరుడికి నేడు మామిడి పండ్ల రసంతో అభిషేకం

నెల్లూరు(సాంస్కృతికం), మే 24(ఆంధ్రజ్యోతి): నగరంలోని పప్పులవీధిలో వెలసి ఉన్న సిద్ధి విఘ్నేశ్వరుడికి ఆదివారం మామిడి పండ్ల రసంతో అభిషేకం జరుగుతుందని ఆలయ అర్చకులు మాచవోలు కోటేశ్వరశర్మ ఓ ప్రకటనలో తెలిపారు. భక్తులు ఉదయం 7.30 నుంచి 10.30గంటల వరకు మామిడి పండ్ల రసం తీసుకువచ్చి స్వామివారికి అభిషేకం జరిపించుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కోవూరు, మే 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇనమడుగు, చెర్లోపాళెం, కోవూరు పట్టణ పరిధిలోని విఘ్నేశ్వరపురం కాలనీల్లో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కే మధుసూదన్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఇనమడుగు సబ్‌స్టేషన్‌లో కొత్త బ్రేకర్లు ఏర్పాటు చేస్తున్నందు వల్ల ఉదయం 9నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు. మెరుగైన విద్యుత్ అందించేందుకు చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. అత్యవసర విభాగాలకు చెందిన సంస్థలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వెంకటాచలం, మే 24 (ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన మండలంలోని సర్వేపల్లి రైల్వే గేటు వద్ద కృష్ణపట్నం పోర్టురోడ్డుపై శనివారం జరిగింది. వివరాల్లోకి వెళితే గూడూరు పట్టణానికి చెందిన మహేష్, రవి ఇద్దరూ మోటర్‌బైక్‌పై నిడిగుంటపాళెం గ్రామానికి వచ్చి తిరిగి గూడూరుకు వెళ్తుండగా సర్వేపల్లి నుంచి ఇడిమేపల్లి వైపు వెళ్తున్న ఆటో బైక్‌ను ఢీకొంది. దీంతో బైక్‌పై ఉన్న ఇద్దరూ గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సర్వేపల్లిలోని ఓ ప్రైవేటు క్లీనిక్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బుచ్చి పట్టణాభివృద్ధికి కృషి

● ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజ

బుచ్చిరెడ్డిపాళెం, మే 24(ఆంధ్రజ్యోతి): కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సహకారంతో బుచ్చి పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజ అన్నారు. శనివారం బుచ్చి నగర పంచాయతీ కౌన్సిల్‌హాల్లో జరిగిన కౌన్సిల్ సమావేశం ప్రశాంతంగా జరిగింది. ఈ సమావేశంలలో ప్రవేశపెట్టి 34 అభివృద్ధి పనులను ఏకగ్రీవంగా ఆమోదించారు. నుడా నిధులు రూ.కోటితో చేపట్టనున్న డ్రైన్లు, రోడ్ల నిర్మాణానికి కౌన్సిల్ ఆమోదించింది. ఈ సమావేశంలో కమిషనర్ బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

కొడవలూరు, మే 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొడవలూరు పంచాయతీ పరిధిలో ఉన్న శ్రీవెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో లక్ష్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ఛైర్మన్ గుణశేఖర్ తెలిపారు. శనివారం కళాశాలలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వివిధ పరిశ్రమల ద్వారా 500 మందికి ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో మొత్తం 10 కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఆయన వెంట కళాశాల సిబ్బంది గిరీష్, తదితరులు ఉన్నారు.

ఘనంగా మహాలక్ష్మీ అమ్మవారి గ్రామోత్సవం

తోటపల్లిగూడూరు, (ఆంధ్రజ్యోతి): మండలంలో కోడూరు గ్రామంలోని మహాలక్ష్మీ అమ్మవారి గ్రామోత్సవం శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి పూలంగిసేవ, కుంకుమ పూజ, మంగళహారతి, మహానైవేద్యం సమర్పించారు. అనంతరం అమ్మవారి గ్రామోత్సవం మేళ తాళాల నడుమ సాగింది. అధిక సంఖ్యలో భక్తులు గ్రామోత్సవంలో పాల్గొన్నారు.

వైభవంగా పెంచలోరి కల్యాణం

రాపూరు, మే 24 (ఆంధ్రజ్యోతి) : పెంచలకోనలో శనివారం స్వామివారి కల్యాణం వైభవంగా జరిగింది. బ్రహ్మోత్సవాల అనంతరం వచ్చిన 2వ శనివారం కావడంతో నెల్లూరు, కడప జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఉదయం దేవేరులతో కల్యాణోత్సవం, సాయంత్రం తిరుచ్చి ఉత్సవం, ఊంజల్‌సేవ అనంతరం క్షేత్రోత్సవం కార్యక్రమాలను అర్చకులు వైభవంగా నిర్వహించారు. భక్తులకు ఉచిత ప్రసాదాలు, అన్న ప్రసాదాలు అందించామని ఆలయ ఈవో పొరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

రీసర్వే పారదర్శకంగా చేయాలి

కోవూరు, మే 24(ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వే ఎలాంటి వివాదాలకు తావులేకుండా పారదర్శకంగా చేపట్టాలని తహసీల్దారు నిర్మలానందబాబ సర్వేయర్లను ఆదేశించారు. వేగూరు పొలిమేర భూముల్లో శనివారం జరిగిన రీ సర్వేను ఆయన పరిశీలించారు. సర్వే చేస్తున్న సర్వేయర్లతో మాట్లాడుతూ రీ సర్వే వల్ల భవిష్యత్తులో రైతులకు ఎలాంటి వివాదాలు తలెత్తకుండా చూడాలన్నారు. వివాదస్పద పొలాల్లో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. భూ వివాదాలు తమ దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు.

చిన్నారి వైద్యానికి ఆర్థికసాయం


బాధితురాలి కుంటుబానికి ఆర్థిక సహాయం అందిస్తున్న దాతలు

కోవూరు, మే 24(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గంగవరం గిరిజన కాలనీలో నివాసముంటున్న డేనియల్, వరలక్ష్మి దంపతుల 7 ఏళ్ల కుమార్తె మానస కుడి కంటికి కేన్సర్ సోకింది. దీంతో కుటుంబసభ్యులు తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారు. విషయం తెలుసుకున్న సాయిరక్ష చారిటబుల్ ట్రస్టు సభ్యులు కేన్సర్‌తో బాధపడుతున్న ఆ చిన్నారి వైద్యానికి ఆర్థిక సహాయం అందించారు. శనివారం ట్రస్టు సభ్యులు లత, అనిల్, నాయక్, పరంధామయ్యలు గ్రామానికి వెళ్లి చిన్నారి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.52,000 అందచేశారు.

పేదలకు ఏ కష్టమొచ్చినా ఆదుకుంటా

● నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి


విడవలూరు : వాటర్ ప్లాంట్ ప్రారంభించి, మహిళకు నీటిని అందిస్తున్న నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

కొడవలూరు/విడవలూరు/బుచ్చిరెడ్డిపాళెం, మే 24(ఆంధ్రజ్యోతి): పేదలకు ఎలాంటి కష్టం వచ్చినా పరిష్కారానికి ముందుంటానని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డితో కలిసి విడవలూరు మండలంలో ఊటుకూరు పల్లిపాళెంలో, మండల కేంద్రమైన కొడవలూరులో, బుచ్చిరెడ్డిపాలెం మండలం మునులపూడిలో వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 175 వాటర్‌ప్లాంట్లు ఏర్పాటు చేశామన్నారు. దివ్యాంగులకు ట్రైసైకిళ్లు అందజేశామన్నారు. గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

● అవినీతి రహిత నియోజకవర్గమే లక్ష్యం

అవినీతి రహిత నియోజకవర్గ స్థాపనకు కృషి చేస్తున్నానని కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి అన్నారు. త్వరలో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయింపు జరుగుతుందన్నారు. అర్హులైన నీరుపేదలకు నూతన పింఛను మంజూరు చేయిస్తానన్నారు. రెవెన్యూ సమస్యలను త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు పాశం శ్రీహరిరెడ్డి, ఏటూరు హరిరెడ్డి, నాపా వెంకటేశ్వర్లు నాయుడు, రామిరెడ్డి విజయభానురెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, జీవీఎన్ శేఖర్‌రెడ్డి, జొన్న శివకుమార్, పూండ్ల అచ్యుత్‌రెడ్డి, కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి, కేతు వెంకటరమణరెడ్డి, నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, బత్తల హరికృష్ణ, గుత్తా శ్రీనివాసులు, కేవీ.శేషయ్య, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమణలపై ఫిర్యాదు

వెంకటాచలం, మే 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చవటపాలెం పంచాయతీ ఎర్రగుంట గ్రామంలో కొందరు రోడ్డును ఆక్రమించి తమ ఇళ్ల ముందు ర్యాంపు నిర్మించి వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్నారని శనివారం ఎంపీడీవో కల్పనకు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని సిమెంటు రోడ్డుపై కాంక్రీట్ వేయడం వల్ల వర్షాకాలంలో నీరు నిలిచి నానా అవస్థలు పడుతున్నామన్నారు. దేవుడి ఊరేగింపు సమయంలో కూడా తమకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. అలాగే సైడ్ కాలువలపై ప్రహరీ గోడల నిర్మాణాన్ని చేపడుతున్నారని, దీంతో సైడ్ కాలువల్లో పేరుకుపోయిన చెత్తను, మురుగును తొలగించే సమయంలో నానా ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. వీటిపై వెంటనే చర్యలు చేపట్టి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని గ్రామస్థులు ఎంపీడీవోను కోరారు.


ప్రజలకు ఇబ్బంది కలిగేలా సిమెంటు రోడ్డుపై వేసి ఉన్న కాంక్రీట్, పక్కనే నిలిచి వున్న వర్షపు నీరు

రామలింగేశ్వర ఆలయ పూజారి రాజీనామా

విడవలూరు, మే 24(ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా వీరాజిల్లుతున్న రామతీర్థం గ్రామంలో వెలసివున్న కామాక్షిదేవి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయ పూజారి పేరేపి శ్రీకాంత్‌శర్మ శుక్రవారం రాజీనామా చేయగా శనివారం వెలుగులోకి వచ్చింది. వచ్చే నెలలో బ్రహ్మోత్సవాలు జరుగునున్న నేపథ్యంలో దేవాలయ అర్చకుడు రాజీనామా చేయడం మండలంలో చర్చనీయాంశంగా మారింది. పేరేపి వంశీకులు మూడు తరాల నుంచి రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రధాన పూజారులుగా సేవలందిస్తున్నారు. మూడో తరానికి చెందిన ఈయన 2005 నుంచి స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహిస్తూ భక్తుల మన్ననలను పొందారు. ఈ క్రమంలో కొన్ని వ్యక్తిగత కారణాలతో ఆలయ ఈవో రామ కృష్ణకు రాజీనామా పత్రాన్ని సమర్పించారు. ఆ లేఖలో ఎన్నో ఏళ్లుగా స్వామి, అమ్మవార్లకి సేవచేసే భాగ్యం పొందానని, నా కుటుంబ పోషణ నిమిత్తం వేరొక ఉద్యోగములో చేరవలసి ఉన్నందున రాజీ నామా చేస్తున్నానని, 10 రోజుల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని, ఈలోగా స్వామివారి సేవకు ఇబ్బంది లేకుండా నిత్యాహ్నికముల చేయ్యగలనని, నా రాజీనామాను ఆమోదించాలని ఆయన పేర్కొన్నారు.


శ్రీకాంత్ శర్మ

వాకింగ్ ట్రాక్ బాగుంటే నడక బాగుంటుంది

బిట్రగుంట, మే 24 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యానికి నడక ఎంత ముఖ్యమో నడిచే ట్రాక్ అంతకన్నా ముఖ్యమని వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బర్నాడ్ అన్నారు. బిట్రగుంట రైల్వే ఫుట్‌బాల్ క్రీడామైదానంలో క్రికెట్ క్రీడామైదానాన్ని కలుపుతూ శనివారం వాకింగ్ ట్రాక్‌ను శుభ్రం చేసే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాక్‌లో రాళ్లను తొలగించి తువ్వ ఇసుకను పరిచామన్నారు.

రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి

● ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

లింగసముద్రం, మే 24 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషిచేస్తున్నారని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక కేఆర్ జడ్పీ హైస్కూల్‌లో వాటర్ ప్లాంటు ప్రారంభోత్సవ కార్యక్రమంలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో ఎంపీ వేమిరెడ్డి వాటర్ ప్లాంటు కోసం షెడ్డును నిర్మించిన నరసింహారావును అభినందించారు. అనంతరం మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమన్నారు. అనంతరం ఎంపీ తన స్వంత నిధులు రూ.5 లక్షలతో, జనసేన మండలాధ్యక్షుడు అంగులూరి నరసిం హారావు రూ.1.50 లక్షలతో నిర్మించిన షెడ్డును, వాటర్‌ప్లాంటులోని మెషిన్‌లను ఎంపి వేమిరెడ్డి, ఎమ్మెల్యే నాగేశ్వరరావు వాటర్ ప్లాంటును ప్రారంభించి మంచినీటిని విడుదల చేశారు.



వాటర్‌ప్లాంటును ప్రారంభిస్తున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

చంద్రబాబు సహకారంతో మౌలిక వసతుల కల్పనకు కృషి : ఎమ్మెల్యే ఇంటూరి

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌ల సహకారంతో కందుకూరు నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే నాగేశ్వరరావు చెప్పారు. సేవాభావం ఉన్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఇప్పటికే వందలాది మందికి ట్రైసైకిళ్లు, వాటర్ ప్లాంటులు నిర్మించి ఇస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన మండలాధ్యక్షుడు అంగులూరి నరసింహారావు, సర్పంచు పులి రామువులు, తహసీల్దార్ కె శ్రీనివాసులు, ఎంపీడీఓ కె శ్రీనివాసులు, హెచ్ఎం మాధవరావు, టీడీపీ నాయకులు జి కల్పన, వంకాయలపాటి మాల్యాద్రి, జి సాంబయ్య, అడపా రంగయ్య, గాలంకి ప్రసాద్, కిలారి కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

● ఉలవపాడు: వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కరేడు గ్రామంలో ఏర్పాటుచేసిన అమృతధార ఆర్వో ప్లాంట్‌ను నెల్లూరు పార్లమెంట్ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శనివారం ప్రారంభించారు.

అంకమ్మ ఆలయం షాపింగ్ కాంప్లెక్స్‌కు బహిరంగ వేలం

● పోటీపడ్డ పాటదారులు ● నెలకు రూ. 2.73 లక్షల ఆదాయం



వేలం పాటలను పర్యవేక్షిస్తున్న దేవదాయ శాఖ డీసీ

కందుకూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): కందుకూరు గ్రామదేవత అంకమ్మ ఆలయ ప్రాంగణంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం, అద్దెలకు శనివారం నిర్వహించిన బహిరంగ వేలంలో పాటదారులు పోటీపడ్డారు. జనార్ధన స్వామి కల్యాణమండపంలో వేలంపాట నిర్వహించగా కందుకూరు డీఎస్పీ సీహెచ్‌వీ బాల సుబ్రహ్మణ్యం, సీఐ వెంకటేశ్వరరావు నేతృత్వంలో భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు.

నెలకు రూ. 2.73 లక్షల ఆదాయం

దేవాదాయ శాఖ గుంటూరు డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు పర్యవేక్షణలో దేవ దాయ శాఖ అధికారులు వేలం పాటలు నిర్వహించగా పాటదారులు పోటీ పడ్డారు. అంకమ్మ ఆలయ ప్రాంగణంలో కనిగిరి రోడ్డుకు అభిముఖంగా 20 రూములు, ఆర్టీసి బస్టాండ్‌లోకి వెళ్లే మార్గంకు అభిముఖంగా 4 రూములు నిర్మించేలా ప్లాన్ రూపొందించగా ఇప్పటికే అక్కడ వివిధ వ్యాపారాలు చేసుకుంటున్న వారితో పాటు ఔత్సాహిక వ్యాపారులు కూడా డిపాజిట్లు చెల్లించి పాటలో పాల్గొన్నారు. దీంతో అత్యధికంగా ఒకటవ నెంబరు షాపును నెలకు రూ. 20 వేలు అద్దె చెల్లించేందుకు ముందుకొచ్చి పాటపాడగా మిగిలిన షాపులను కూడా పోటీపడి పాడారు. దీంతో అంకమ్మ అమ్మ వారికి ప్రతిఏటా రూ. 32.7 లక్షలకు పైగా అద్దెల రూపంలో ఆదాయం రానుంది. ఈసందర్భంగా డీసీ శ్రీనివాసరావు మాట్లాడుతూ పాటదారులు వారే స్వంత నిధులతో శాశ్వత గదుల నిర్మాణం చేయాల్సి ఉంటుందని, ఈ నిర్మాణం నాలుగు నెలల్లో పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వ్యాపారాలు ప్రారంభించే సమయానికి పాటదారులు ప్రస్తుతం చెల్లించిన రిఫండబుల్ డిపాజిట్ కాక ఒక ఏడాది అద్దె ముందస్తుగా చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. కందుకూరు గ్రామదేవత అంకమ్మ దేవాలయం ఆదాయం పెంచాలని ప్రయత్నించామే తప్ప మాకు ఎలాంటి స్వార్థం లేదని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. వేలం పాటలను పర్యవేక్షిం చేందుకు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆలయం వద్ద ఆధ్యాత్మిక వాతావరణం ఏర్పడేలా చూస్తామని ఆరునెలల్లో దేవాల యంకు ట్రస్టుబోర్డును కూడా నియమిస్తామని ఆయన తెలిపారు.

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారించాలి

లింగసముద్రం, మే 24 ఆంధ్రజ్యోతి): గ్రామాలలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ పెన్నా కృష్ణయ్య అధికారులను ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీఓ కట్టా శ్రీనివాసులు అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ గ్రామాలలో మరమ్మతులకు గురైన చేతిపంపులను, పగిలిన మంచినీటి పైపులను అధికారులు వెంటనే బాగు చేయించాలన్నారు. అనంతరం శాఖల వారీగా అధికారులు అభివృద్ధి పనులను వివరించారు. ఆర్‌డబ్లూఎస్ ఏఈ రాజశేఖర్ మాట్లాడుతూ మండలానికి 25 కమ్యూనిటీ సోక్‌పిట్లు మంజూరయ్యాయని, వాటిని త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు. శింగరపాలెం ట్యాంకు నిర్మించి నీటిని సరఫరా చేయకుండా నిరుపయోగంగా ఉండడంతో, వెంగళాపురం ట్యాంకు నుంచి నీటిని ఆ గ్రామస్థులకు ఇస్తుండడంతో తమకు నీరు తక్కువగా సరఫరా అవుతోందని ఎర్రారెడ్డిపాలెం సర్పంచి డి మలికార్జున చెప్పారు. అలాగే ఉట్లవారిపాలెం గ్రామంలోని ట్యాంకుకు నీరు తక్కువగా వస్తోందని ఆయన చెప్పారు. తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కృష్ణయ్య చెప్పారు. అలాగే తిమ్మారెడ్డిపాలెం శ్మశాన వాటికలో చిల్లచెట్లు ఎక్కువగా ఉండడంతో గ్రామస్థులు మృతదేహాలను రోడ్డు పక్కనే ఖననం చేస్తున్నారని ఎంపీటీసీ దగ్గు వెంకటేశ్వర్లు చెప్పారు. అలాగే మాలకొండరాయునిపాలెంలో అసంపూర్తిగా నిర్మించిన సచివాలయంలో పచ్చాకు కూలీలు ఉంటున్నారని సర్పంచు వంటేల శ్రీనివాసులు చెప్పారు. నిధులు మంజూరైన వెంటనే పనులు పూర్తిచేస్తామని పీఆర్ ఏఈ శ్రీనివాసులు చెప్పారు. మరలా రాష్ట్రంలో కరోనా కేసులు వస్తున్నాయని ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డా.పి రమేష్ సూచించారు. బహిరంగ ప్రదేశాలలో మాస్కులు ధరించాలన్నారు. ఆర్ఆర్ పాలెం గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని సర్పంచు సీహెచ్ అంజమ్మ కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కలిగిరి, మే 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో అందిస్తున్న మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి గ్రామీణ పథకం, రాష్ట్రప్రభుత్వ ఆధ్వర్యంలో ఉద్యానశాఖ అందిస్తున్న వివిధ పథకాల రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వింజమూరు ఉద్యాన శాఖాధికారి షేక్ షాహిల్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని తూర్పుగుడ్లదొన, పడమరగుడ్లదొన, ఎరుకులరెడ్డిపాలెం పంచాయతీలలో ప్రభుత్వం అందిస్తున్న పథకాల రాయితీలపై అవగాహన సదస్సులు నిర్వహించారు. జాబ్‌కార్డు కలిగి ఐదు ఎకరముల లోపు ఉన్న సన్న, చిన్నకారు రైతులు ఉద్యాన పంటల సాగుచేపట్టుటకు, స్వల్పకాలిక పంటలైన మల్లె, గులాబీ పూలతోటల పెంపకం, పశుగ్రాస పెంపకం, నీటికుంటలకు పథకాలకు ఆసక్తిగల రైతులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పడమరగుడ్లదొన పంచాయతీ కార్యదర్శి హరికృష్ణ, ఉపాధిహామీ టీఏ చెన్నయ్య, ఎఫ్ఏ రమణయ్య, రైతులు పాల్గొన్నారు.

మాలకొండ ఆదాయం రూ. 15,98,061

వలేటివారిపాలెం, మే 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ. 15,98,061 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కే.వి సాగర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. అష్టోత్తరం టిక్కెట్‌ల ద్వారా రూ. 8550, కుంకుమార్చన ద్వారా రూ. 20,520, వివాహముల ద్వారా రూ. 7 వేలు, తలనీలాలు ద్వారా రూ. 78,850, వాహనపూజలు ద్వారా రూ. 4,360, ప్రత్యేక దర్శనం ద్వారా రూ. 5,66,000, స్థలపురాణం పుస్తకాలు విక్రయం ద్వారా రూ. 640, రూముఅద్దెలు ద్వారా రూ. 33,910, కవర్లు ద్వారా రూ. 10,200, లడ్డుప్రసాదం ద్వారా రూ. 2,54,345, అన్నదానం ద్వారా రూ. 6,03,186, విరాళముల ద్వారా 10,500, ఆదాయం లభించినట్లు ఆలయ డీసీ సాగర్‌బాబు తెలియజేశారు.

రెండు కుటుంబాల మధ్య ఘర్షణ

● పలువురికి గాయాలు

వలేటివారిపాలెం, మే 24 (ఆంధ్రజ్యోతి): రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో పలువురికి తీవ్ర గాయాలైన సంఘటన మండల కేంద్రమైన వలేటివారిపాలెంలో శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో జరిగింది. ఆ ఘర్షణలో లీలమ్మ, శ్రీదేవి, వెంకట్రావు, సాయి, మనోజ్‌లతో పాటు పలువురికి గాయాలయ్యాయి. ఘర్షణలో గాయపడిన వారిని వలేటివారిపాలెం 108 వాహనంలో కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చి చికిత్స చేస్తున్నారు. గత కొన్ని నెలలుగా ఆ రెండు కుటుంబాల మధ్య ఘర్షణలు జరిగి ఇరువురిపై కేసులు కూడా నమోదయ్యాయి. కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

20 మద్యం సీసాల స్వాధీనం

కలిగిరి, మే 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెల్లపాడు, సిద్దన కొండూరు గ్రామాల్లో శనివారం కలిగిరి ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ దాడుల్లో 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ అబ్దుల్ జలీల్ తెలిపారు. ఇద్దరు వ్యక్తులు తమవద్ద పరిమితికి మించి మద్యం సీసాలను కలిగి ఉండటం వలన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

లేగదూడల పోషణలో జాగ్రత్తలు పాటించాలి

కలిగిరి, మే 24 (ఆంధ్రజ్యోతి): లేగదూడల పోషణలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ విజయ్‌కుమార్ పాడిరైతులకు సూచించారు. శనివారం మండలంలోని కుమ్మరకొండూరు గ్రామంలో పాడిరైతులకు లేగదూడల పోషణలో తీసుకోవాల్సిన జాగ్రతలు, వాటి పెంపకం తదితర అంశాలపై అవగాహన కలిగించారు. అనంతరం లేగదూడలకు పోటీలు నిర్వహించి ఆరోగ్యవంతమైన దూడల యజమానులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈవో శ్రీనివాసులు, ఏడీ సురేష్, గ్రామ టీడీపీ నాయకులు కాపుగొర్ల మురళి, పాడిరైతులు పాల్గొన్నారు.

ముగిసిన ఉజ్జీవ మహాసభలు

కలిగిరి, మే 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకన్నపాలెం గ్రామంలో సెంటినరి తెలుగు బాప్టిస్ట్ చర్చిలో జరుగుతున్న ఉజ్జీవ మహాసభలు శనివారం ముగిసాయి. ఈ సందర్భంగా పాస్టర్ జయప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలని సూచించారు. ఈ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నేత బంగారురెడ్డికి ఘన నివాళి

ఉలవపాడు, మే 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆర్భావం నుంచి పార్టీలో కొనసాగుతూ ఆదర్శంగా నిలిచిన చిట్టా బంగారురెడ్డి (65) శనివారం అనారోగ్యంతో కన్నుమూశారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావులు ఆయన భౌతిక కాయానికి పూలమా లలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఫుట్‌బాల్ టోర్నీ విజేతలు బిట్రగుంట జట్లు

కావలిటౌన్, మే 24 (ఆంధ్రజ్యోతి) : దేవ్ మెమోరియల్ (దేవరాజ్) రెండు జిల్లాల ఫుట్‌బాల్ టోర్నీ విన్నర్స్ రన్నర్స్‌గా బిట్రగుంట జట్లు నిలిచాయి. కావలి ఫుట్‌బాల్ అసోసియేషన్ (కెఎఫ్‌సి) ఆధ్వర్యంలో జేబీ డిగ్రీ కళాశాల డీఆర్ క్రీడా ప్రాంగణంలో జరిగిన రెండు జిల్లాల ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో ఫైనల్స్‌కు రెండు బిట్రగుంట జట్లే చేరుకోవడంతో బిట్రగుంట ఎ జట్టు విన్నర్స్‌గా బిట్రగుంట బి జట్టు రన్నర్స్‌గా నిలిచాయి. కార్యక్రమంలో నిర్వాహకులు శేషు, రాము, ఫరూఖ్, మనోజ్, తేజ, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

సుజనమ్మ మృతికి సంతాపం

కావలి, మే 24 (ఆంధ్రజ్యోతి): కావలి రెడ్‌క్రాస్ భవన నిర్మాణదాత, ప్రముఖ వైద్యులు చిల్లకూరు లక్ష్మీనరసారెడ్డి సతీమణి సుజనమ్మ (85) శుక్రవారం చెన్నైలో మరణించింది. దీంతో శనివారం కావలి రెడ్‌క్రాస్ భవనంలో రెడ్‌క్రాస్, రోటరీ క్లబ్ బాధ్యులు సంతాప సభ నిర్వహించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ డీ రవిప్రకాష్, రోటరీ క్లబ్ సభ్యులు నల్లూరు రవికుమార్, రెడ్‌క్రాస్ బాధ్యులు డాక్టర్ పామూరు శ్రీధర్, డాక్టర్ రమ్య, ఏవీ హనుమకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సీతారాముల ఉత్సవాలు

ఉదయగిరి, మే 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్లపడియ గ్రామంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న సీతారాముల ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అలంకరణలు నిర్వహించారు. ఆనందోత్సవాల నడుమ వసంతోత్సవ కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం స్వామివారిని గ్రామోత్సవంగా పారువేటకు తరలించి ఉత్సవాలకు ముగింపు పలికారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

డిపో మేనేజర్‌కు పదోన్నతి

ఉదయగిరి, మే 24(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపోలో మేనేజర్‌గా పని చేస్తున్న ఎం. శ్రీనివాసరావుకు ప్రజా రవాణా సంస్థ అధికారిగా (రీజనల్ మేనేజర్) పదోన్నతి కల్పిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన్ను బాపట్ల ఆర్ఎంగా నియమించారు.

బాధ్యతల స్వీకరణ

ఉదయగిరి, మే 24(ఆంధ్రజ్యోతి): స్థానిక వెలుగు కార్యాలయ ఇన్‌చార్జి ఏపీఎంగా కృష్ణారావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఏపీఎం ఖాజారంతుల్లాను డీఆర్‌డీఏ జిల్లా కార్యాలయానికి బదిలీ చేశారు. దీంతో కావలి ఏపీఎంగా పని చేస్తున్న కృష్ణారావును ఇన్‌చార్జీగా నియమించడంతో ఆయన బాధ్యతలు చేపట్టారు.

డిజిటల్ అసిస్టెంట్ లేక అవస్థలు

అనంతసాగరం మే 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక సచివాలయం-1లో డిజిటల్ అసిస్టెంట్ పోస్టు ఖాళీగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ పనిచేస్తున్న సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్‌కు అదనపు బాధ్యతలు అప్పగించడంతో అతను రెండు పనులు చేయలేక పనులు నిలిచిపోతున్నాయి. ప్రస్తుతం రేషన్‌కార్డుల ప్రక్రియ కొనసాగుతోంది. అధికారులు చొరవ చూపి డిజిటల్ అసిస్టెంట్‌ను నియమించేలా చర్యలు తీసుకోవాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

లైంగిక వేధింపుల నివారణకు కఠిన చట్టాలు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కందుకూరు సీనియర్ సివిల్ న్యాయాధికారి శోభ

కందుకూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): పనిచేసే చోట మహిళలపై లైంగిక వేధింపులు జరిగితే బాధ్యులకు కఠిన శిక్షలు విధించేలా చట్టాలు అమలులో ఉన్నాయని కందుకూరు సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎం శోభ పేర్కొన్నారు. కందుకూరు సబ్ కోర్టులో శనివారం కార్యక్షేత్ర మహిళా లైంగిక వేధింపులు - నివారణ, నిషేధం అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం. శోభ మాట్లాడుతూ పనిప్రదేశాల్లో మహిళలు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపుల గురించి, అలాంటి బాధితులకు రక్షణగా చట్టంలో ఉన్న కఠిన చట్టాల గురించి వివరించారు. కార్యక్షేత్రంలో మహిళలు వేధింపులకు గురైతే స్త్రీల సమానత్వం, స్వేచ్ఛకు భంగం కలిగినట్లే భావించటం జరుగుతుందని, ఇలాంటి ఘటనలకు బాధ్యులను కఠినంగా శిక్షించటం జరుగుతుందని తెలిపారు. ఈసందర్భంగా కఠిన చట్టాలు, ఆ చట్టాల ప్రభావంతో పడే శిక్షల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్యానెల్ న్యాయవాది జె వసంతలక్ష్మి, న్యాయవాదులు ఎం మనోహర్, పోకూరి కోటయ్య, ప్యారాలీగల్ వాలంటీర్లు గడ్డం వెంకటరావు, గంగుల హరిబాబు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కుబడి సర్వేలు చేయవద్దు : ఎంపీడీవో

వలేటివారిపాలెం, మే 24 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా సర్వేలు మొక్కుబడిగా చేయవద్దని ఎంపీడీఓ నరేంద్రదేవ్ తెలిపారు. మండలంలోని నూకవరం గ్రామ సచివాలయాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. అనంతరం మాట్లాడుతూ సర్వేలు నామమాత్రంగా చేయకుండా ప్రతి ఇంటికీ వెళ్లి చేయాలని తెలిపారు. ప్రజలు యోగా రిజిస్ట్రేషన్ చేయించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. పలు సేవల ద్వారా వచ్చిన సేవా రుసుంను డిజిటల్ అసిస్టెంట్‌లు ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి జమచేయాలని సూచించారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

మండలంలోని కళవళ్లలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శనివారం ఏపీఓ దయాసాగర్ పరిశీలించారు. ఉదయం 6 గంటలకే పనులకు వెళ్లి తిరిగి 10 గంటల్లోపు ఇళ్లకు వెళ్లాలని కూలీలకు సూచించారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పనులు కల్పించాలని సూచించారు.

ముందస్తు రుణ ప్రణాళికపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఎం శ్రీనివాసులు

ఉదయగిరి, మే 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక స్త్రీశక్తి భవనంలో పొదుపు సభ్యులకు ముందస్తు రుణ ప్రణాళికపై ఏపీఎంలు, సీసీలకు బ్యాంకు లింకేజీ డీపీఎం శ్రీనివాసులు, జిల్లా యాంకర్ పర్సన్ భాను ప్రసాద్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సభ్యుల జీవనోపాధుల పెంపుకు ప్రభుత్వం ముందస్తు రుణ ప్రణాళికను చేపట్టిందన్నారు. సభ్యులు ఆర్థిక, వ్యాపార, గృహావసరాల నిమిత్తం బ్యాంకుకు వెళ్లకుండా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే నేరుగా వారి ఖాతాలకు నగదు జమ చేయడం జరుగుతుందన్నారు. మంజూరు చేసే రుణంలో సభ్యులు 30 శాతం గృహావసరాలకు, 70 శాతం వ్యాపారానికి వినియోగించుకోవచ్చన్నారు. మండలంలో 886 గ్రూపులకు సంబంధించి ముందస్తు రుణాలకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీతారామపురం, ఉదయగిరి, దుత్తలూరు, వరికుంటపాడు మండలాల ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

1న యాదవ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు

సంగం, మే 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2025 మార్చిలో పదో తరగతిలో 470 మార్కులకుపైగా సాధించిన యాదవ విద్యార్థులకు జూన్ 1వ తేదీన నెల్లూరులోని యాదవ భవనంలో ప్రతిభా పురస్కారోత్సవ కార్యక్రమం జరుగుతుందని యాదవ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ జిల్లా ఆర్థిక కార్యదర్శి పీలం సురేష్‌బాబు ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హౌసింగ్, సమాచార, పౌరసంబంధాలశాఖామాత్యులు కొలుసు పార్థసారధి, వైఈపీఏ (యాదవ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) వ్యవస్థాపకులు మాదాల వెంకటేశ్వరరావు హాజరవుతారని తెలిపారు. 470 మార్కులకు పైగా వచ్చిన యాదవ విద్యార్థులు ఈ 9705800794, 9573105305 నెంబర్లకు తెలియజేయాలని కోరారు. అవకాశాన్ని యాదవ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

విద్యతోనే ప్రగతి సాధ్యం

నిత్యాన్నదాత కంచి పరమేశ్వరరెడ్డి



విద్యార్థులకు ప్రశంసాపత్రాన్ని, నగదును అందజేస్తున్న కంచి పరమేశ్వరరెడ్డి

ఆత్మకూరు, మే 24 (ఆంధ్రజ్యోతి) : విద్యతోనే ప్రగతి సాధ్యపడుతుందని, విద్యార్థులు బాగా చదువుకుని ఉజ్వల భవితకు బాటలు వేసుకోవాలని నిత్యాన్నదాత, శ్రీ సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి తెలిపారు. స్థానిక అలఘునాథస్వామి కల్యాణ మండపంలో శనివారం ఏర్పాటు చేసిన అభినందన సభలో పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించి ప్రతిభ కనబరచిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు రూ.3,24,500 నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఆత్మకూరు, అనంతసాగరం మండలాల్లోని 21 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, 14 ప్రైవేటు పాఠశాలల్లో 500 నుంచి 575 మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సహక బహుమతులు నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేసి సన్మానించారు. ఆయన మాట్లాడుతూ పదో తరగతిలో ప్రతిభ కనబరచిన విద్యార్థులను ప్రోత్సాహించి చేయూత అందించాలనే లక్ష్యంతో నగదు బహుమతులు అందించడం జరుగుతుందన్నారు. ప్రతి ఏడాది తన సొంత నిధులతో ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు పలు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు, విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యారు.

ఎన్‌కేబీసీ పరిశీలన



క్షేత్రంలో పరిశీలిస్తున్న డీఎల్‌డీఏ చైర్మన్ విజయ్‌కుమార్

కొండాపురం, మే24(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలదీవి వద్ద ఉన్న జాతీయ కామధేను పునరుత్పత్తి కేంద్రాన్ని డీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్ శనివారం సందర్శించారు. ఈసందర్భంగా క్షేత్రంలోని చెరువులు, మేతకు ఏర్పాటుచేసిన భూములను ఆయన పరిశీలించారు. క్షేత్రంలో గొర్రెలకు షెడ్లు లేవని అధికారులు ఆయన దృష్టికి తీసుకురాగా ఉన్నతాధికారులకు తెలియచేసి మంజూరుకు కృషిచేస్తానన్నారు. అలాగే క్షేత్రంలో పనిచేసే కార్మికులకు ఈపీఎఫ్ నిధులు విడుదలకాలేదని విన్నవించగా పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో క్షేత్ర వైద్యులు బలరామక్రిష్ణ, నాగరాజు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

307 పొగాకు బేళ్ల కొనుగోలు

కలిగిరి, మే 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి శనివారం రైతులు మొత్తం 389 పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకురగా వేలంలో 11 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 307 బేళ్లు కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 82 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.200, సగటు ధర రూ.243.62గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి టి ఇసాక్‌స్వరన్‌దత్ తెలిపారు.

డీసీ పల్లిలో పొగాకు ధరలు

మర్రిపాడు, మే 24 (ఆంధ్రజ్యోతి) : డీసీ పల్లి పొగాకు వేలం కేంద్రానికి శనివారం రైతులు 573 బేళ్లను తీసుకుని రాగా, 18 కంపెనీల ప్రతి నిధులు వేలంలో పాల్గొని 400 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణా లతో 173 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ఠ ధర రూ280కాగా, కనిష్ఠ ధర రూ200గా పలికినట్లు వేలం నిర్వహణాధికారి జీ.రాజ శేఖర్ తెలిపారు.

టీడీపీ నూతన అధ్యక్షుల ఎంపిక



తుమ్మల చంద్రారెడ్డి (పట్టణ అధ్యక్షుడు)



సుంకర పెంచలచౌదరి (మండల టీడీపీ అధ్యక్షుడు)

ఆత్మకూరు, మే 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర మంత్రి, నియోజకవర్గ ఎమ్మెల్యే ఆనం రామ నారాయణ రెడ్డి నేతృత్వంలో నియోజకవర్గంలోని ఆరు మండలాలకు టీడీపీ నూతన అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. ఆత్మకూరు పట్టణ అధ్యక్షులుగా తుమ్మల చంద్రారెడ్డి, ఆత్మకూరు మండల టీడీపీ అధ్యక్షులుగా సుంకర పెంచలచౌదరి రెండోసారి ఎంపికయ్యారు. అనంతసాగరం మండల టీడీపీ అధ్యక్షులుగా మెట్టుకూరు కృష్ణారెడ్డి, ఏఎస్‌పేట మండల పార్టీ అధ్యక్షులుగా అబ్బూరి రమేష్‌నాయుడు, చేజర్ల, మర్రిపాడు, సంగం మండలాల టీడీపీ పార్టీ అధ్యక్షులుగా షేక్ సిరాజుద్దీన్, శాఖమూరి నారాయణ, బాణా శ్రీనివాసులరెడ్డిని ఎంపిక చేశారు. మండల కన్వీనర్లుగా నియమించిన రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ



పాఠ్య పుస్తకాలను పరిశీలిస్తున్న సీఎంవో పెంచలయ్య

ఉదయగిరి, మే 24(ఆంధ్రజ్యోతి): పాఠశాలల పునఃప్రారంభించిన రోజే ప్రతి విద్యార్థికి రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసిన విద్యార్థిమిత్ర కిట్లను పంపిణీ చేస్తామని సర్వశిక్షా అభియాన్ జిల్లా కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి (సీఎంవో) కే.పెంచలయ్య అన్నారు. శనివారం స్థానిక ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పాఠ్య పుస్తకాల స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. ఆయన మాట్లా డుతూ జిల్లాకు 1,61,959 లక్షల బ్యాగులు రావాల్సి ఉండగా 80,000 వేలు, 7,70,888 లక్షల పాఠ్యపుస్త కాలు రావాల్సి ఉండగా 6,61,683 లక్షలు వచ్చాయన్నారు. అలాగే 1,15,548 లక్షల బెల్టులు, 8,74,740 లక్షల నోట్ పుస్తకాలు, 13,375 వేల అక్స్‌ఫోర్డు డిక్షనరీలు వచ్చాయన్నారు. విద్యార్థిమిత్ర కిట్లలో భాగంగా బూట్లు, యూనిఫాం రావాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో సీఆర్ఎంటీలు ఇనయితుల్లా, భోగ్యం శ్రీనివాసులు, మౌలాద్రి పాల్గొన్నారు.

మా ఇంటికి రండి!





సీఎం చంద్రబాబు నూతన గృహం

- ఆశీర్వదించి వెళ్లండి
- చంద్రబాబు గృహప్రవేశానికి ఇంటింటికీ అందిన ఆహ్వానం
- కుటుంబ సమేతంగా కుప్పం చేరుకున్న సీఎం
- పాతికవేలమందికి పైగా భోజనాలకు ఏర్పాట్లు

ఇంటింటా సందడే. సొంత కుటుంబ సభ్యుడే గృహప్రవేశం చేస్తున్నట్లు తెలియని హడావుడే. అవును.. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివారం నాడు గృహప్రవేశం చేయనున్నారు. ఇందుకోసం ఆయనతోపాటు కుటుంబ సభ్యులందరూ శనివారం రాత్రికే కుప్పం చేరుకున్నారు. చంద్రబాబు తరఫున ఆహ్వానాలు అందుకున్న నియోజకవర్గ ప్రజలు, టీడీపీ కార్యకర్తలు ఆ పండుగకు హాజరై చంద్రబాబు కుటుంబ సభ్యులను ఆశీర్వదించి, విందు భోజనాలు చేసి రావడానికి తయారవుతున్నారు.

కుప్పం, మే 24 (ఆంధ్రజ్యోతి):కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలం కడపల్లె పంచాయతీ పరిధిలోని శివపురంవద్ద రెండెకరాల స్థలంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నూతన గృహాన్ని నిర్మించుకున్నారు.సతీమణి నారా భువనేశ్వరితో కలిసి కుటుంబ సమేతంగా ఆదివారం తెల్లవారుజామున 3-4 గంటల మధ్య గృహప్రవేశం చేయనున్నారు. చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి శనివారం మధ్యాహ్నమే కుప్పం చేరుకుని పీఈఎస్ వైద్య కళాశాల అతిథి గృహంలో బస చేశారు.నూతన గృహానికి వెళ్లి, అక్కడి గృహప్రవేశ ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు. నారా లోకేశ్, బ్రాహ్మణి దంపతులు కుమారుడు దేవాన్ష్‌తో కలిసి రాత్రి 8గంటల ప్రాంతంలో కుప్పం చేరుకున్నారు.రెండు రోజుల ఢిల్లీ పర్యటనకు వెళ్లిన సీఎం చంద్రబాబు అర్ధరాత్రి తర్వాత కుప్పం వచ్చారు.గృహప్రవేశ ఏర్పాట్లు ఘనంగానే జరుగుతున్నాయి. సుమారు 25వేలమందికి భోజనాల ఏర్పాట్లు చేశారు.

అందరికీ ఆహ్వానాలు

ముఖ్యమంత్రి స్థానిక ఎమ్మెల్యే కూడా కావడంతో నియోజకవర్గంలోని ప్రతి కుటుంబనుంచి కనీసం ఒక్కరైనా గృహప్రవేశానికి వచ్చి భోజనం చేసి వెళ్లేలా ఆహ్వానం పలకాలని టీడీపీ శ్రేణులకు సూచించారు. సామాజిక మాధ్యమాల్లో డిజిటల్ ఆహ్వాన పత్రికలు పెట్టడంతోపాటు, పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామగ్రామానికి వెళ్లి ముద్రించిన పత్రికలను పంచి గృహప్రవేశానికి ప్రజలను ఆహ్వానించారు. టీడీపీ కార్యకర్తలు, నాయకులకు సైతం ప్రత్యేక ఆహ్వానాలు అందాయి.

విద్యార్థులకు శుభవార్త

జిల్లాకు జవహర్ నవోదయ విద్యాలయం



తిరుపతి, మే 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పరిధిలోని జవహర్ నవోదయా విద్యాలయం జిల్లాకు మంజూరు కానుంది. దానికోసం జిల్లాలో 30 ఎకరాల అనువైన భూమిని గుర్తించేందుకు కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ రెవిన్యూ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో మూడేళ్ల కిందట జిల్లాల పునర్విభజన జరిగిన సంగతి తెలిసిందే. ఇదివరకూ పాత జిల్లాల పరిధిలో జిల్లాకు ఒకటి చొప్పున జవహర్ నవోదయా విద్యాలయాలను కేంద్రం ఏర్పాటు చేసింది. పునర్విభజన తర్వాత కొన్ని జిల్లాలు వాటిని కోల్పోయాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో మదనపల్లెలో ఈ విద్యాలయం ఏర్పాటైంది. అయితే పునర్విభజన కారణంగా అటు చిత్తూరు, ఇటు తిరుపతి రెండు జిల్లాల పరిధిలోనూ జవహర్ నవోదయా విద్యాలయాలు లేకుండా పోయాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రతి జిల్లాలోనూ జవహర్ నవోదయా విద్యాలయాలను ఏర్పాటు చేసే విధానం కింద తిరుపతి జిల్లాకు మంజూరు చేసేందుకు అంగీకరించింది. ఇటీవల సీఎం చంద్రబాబు ఢిల్లీకి వెళ్లి వివిధ శాఖల కేంద్ర మంత్రులను కలసిన సందర్భంలోనూ ఈ విషయం ప్రస్తావనకు వచ్చింది. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ సానుకూలంగా స్పందించడంతో అనువైన భూములను ఎంపిక చేసి వెంటనే సమాచారం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది. శనివారం ఉదయం దీనిపై కలెక్టర్ సమీక్షించారు. నవోదయా విద్యాలయం కోసం 30 ఎకరాలు అవసరమని, ఆ మేరకు అందుబాటులో ఉన్న భూములను గుర్తించాలని ఆయన జాయింట్ కలెక్టర్ శుభం బన్సాల్‌ను ఆదేశించారు. నగరంలో కాకపోయినా వడమాలపేట మండల పరిధిలో అయినా పరవాలేదని, అక్కడ కూడా ల్యాండ్ పార్సిల్స్ పరిశీలించాలని ఆదేశించారు. 30 ఎకరాలకు తగ్గకుండా ల్యాండ్ పార్సిల్స్ గుర్తించి సమాచారం కేంద్రానికి పంపిస్తే అక్కడి నుంచి జవహర్ నవోదయ సొసైటీ ప్రతినిధులు క్షేత్రస్థాయి పరిశీలనకు రానున్నట్లు సమాచారం. జిల్లాలో ఇప్పటికే నాలుగు కేంద్రీయ విద్యాలయాలున్నాయి. తిరుపతిలో రెండు, వెంకటగిరిలో ఒకటి, ఐఐటీ వద్ద ఒకటి చొప్పున నాలుగు ఉన్నప్పటికీ జవహర్ నవోదయా విద్యాలయం లేని లోటు అలాగే ఉండిపోయింది. తాజాగా కేంద్ర ప్రభుత్వ సానుకూల స్పందనతో ఆ లోటు కూడా పూడనుంది.

ఇన్‌స్టాగ్రాం 'బంధం' విషాదాంతం

- శ్రీకాళహస్తి యువకుడి చెంతకు విశాఖ వివాహిత
- భర్త, పిల్లలను వీడి ప్రియుడితో వివాహం
- అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి
- విషం తాగి యువకుడు కూడా..





పద్మ(ఫైల్ ఫొటో) - సురేశ్ మృతదేహం

శ్రీకాళహస్తి, మే 24(ఆంధ్రజ్యోతి): ఇన్‌స్టాగ్రాం పరిచయంతో చేరువైన వివాహిత, యువకుడి జీవితాలు విషాదాంతమయ్యాయి.విశాఖపట్నంలోని ముస్లింతాటిచెట్లపాళెం వీధికి చెందిన వెంకటలక్ష్మి అలియాస్ పద్మ(40)కు భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు మెడికల్ రిప్రజంటేటివ్‌గా పనిచేస్తుండగా, కుమార్తె డిగ్రీ చివరి సంవత్సరం విద్యార్థిని. ఎక్కువగా ఇన్‌స్టాగ్రాం రీల్స్ చూస్తుండే పద్మకు ఏడాదిన్నర క్రితం శ్రీకాళహస్తిలోని కైలాసగిరికాలనీకి చెందిన ఎలక్ట్రీషియన్ సురేశ్(25)తో పరిచయం ఏర్పడింది. ఏడాది క్రితం పద్మ భర్త, పిల్లలను వదిలేసి శ్రీకాళహస్తికి వచ్చేసింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఆమె శ్రీకాళహస్తిలో ఉన్నట్లు గుర్తించిన విశాఖ పోలీసులు తిరిగి కుటుంబ సభ్యులకు అప్పగించారు. సురేశ్‌తోనే జీవితం కొనసాగించాలని ఉందంటూ లేఖ రాసి గతేడాది నవంబరులో ఆమె మళ్లీ శ్రీకాళహస్తికి వచ్చేశారు. కుటుంబసభ్యులు బతిమలాడినా రానని తెగేసి చెప్పిన ఆమె సురేశ్‌ను వివాహం చేసుకున్నారు. సురేశ్ తల్లిదండ్రులు అభ్యంతరం తెలపడంతో కైలాసగిరిలో పద్మతో కాపురం పెట్టాడు. అయితే, ఏం జరిగిందో గానీ మూడు రోజుల క్రితం పద్మ మృతి చెందారు. దీంతో సురేశ్ కూడా గడియ పెట్టుకుని ఆ గదిలోనే ఉండిపోయాడు. శనివారం బయటకు వచ్చిన సురేశ్ తన తల్లి వద్దకు వెళ్లి పద్మ మరణవార్త తెలిపారు. టిఫిన్, భోజనాన్ని వృథా చేస్తోందని మందలించడంతో మూడురోజుల క్రితం పద్మ ఉరి వేసుకుందని, శవాన్ని కిందకు దించి, భయంతో విషం తాగానని సురేశ్ తెలిపారు. మూడురోజుల తరువాత మెలకువ రావడంతో బయటికి వచ్చానన్నారు. సురేశ్ తల్లిదండ్రులు ఇచ్చిన సమాచారం మేరకు శ్రీకాళహస్తి రెండో పట్టణ పోలీసులు పద్మ మృతదేహాన్ని పరిశీలించారు. విశాఖలోని ఆమె కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. విషం తాగిన సురేశ్‌ను ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మరణించారు.

తిరుమల చాలా మారింది ఎంఎస్‌కే ప్రసాద్





ఎంఎస్‌కె ప్రసాద్ - పిచండి - నందకిషోర్

గతంతో పోలిస్తే తిరుమలలో చాలా మార్పులు కనిపిస్తున్నాయని క్రికెటర్ ఎంఎస్‌కే ప్రసాద్ అన్నారు. శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన బయట మీడియాతో మాట్లాడుతూ భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలు బాగున్నాయన్నారు. ఇందుకు టీటీడీ అధికారులకు అభినందనలు తెలిపారు. ఇక, ఐపీఎల్ చాలా చక్కగా జరుగుతోందని, కొన్ని కారణాలతో వారంపాటు నిలిచిపోయినప్పటికీ తిరిగి మ్యాచ్‌లు ప్రారంభమయ్యాయని తెలిపారు. ప్రస్తుతం టాప్4లో గుజరాత్, ఆర్సీబీ, పంజాబ్, ముంబాయ్ ఇండియన్స్ ఉన్నారు. ఇక, టాప్2లోకి ఎవరు వస్తారనేది ఆసక్తిగా మారిందన్నారు. కాగా శనివారం తమిళనాడు డిప్యూటీ స్పీకర్ పిచండి, కలెక్టర్ వెంకటేశ్వర్, బళ్లారి ఎమ్మెల్యే భరత్‌రెడ్డి, సినీనటుడు నందకిషోర్ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

తిరుపతి అర్బన్, మే 24(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును బాధితునికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు శనివారం పంపిణీ చేశారు. ఐదో డివిజన్ లోని మారుతినగర్‌కు చెందిన మోహన్ కృష్ణ లివర్ వ్యాధికి చికిత్స చేయించుకున్నాడు. ఆర్థికసాయం కోరుతూ సీఎంఆర్ ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఆ మేరకు రూ.7లక్షలు మంజూరైంది. ఎమ్మెల్యే సంబంధిత చెక్కును బాధితుడి తల్లికి అందజేశారు. ఐదవ డివిజన్ అధ్యక్షులు పురుషోత్తం పాల్గొన్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 16 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్ 2 లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్ 1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.3.02 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 74,374

తలనీలాలు సమర్పించినవారు: 37,477

- ఆరేళ్లుగా పరిశోధనా కేంద్రానికి తాళం
- నిధులు కేటాయిస్తే వెలుగులోకి శేషాచల విశేషాలు

జీవవైవిధ్య పరిశోధనలకు ఫుల్‌స్టాప్



క్రిస్టల్ సర్పెంట్ ఈగల్

జీవ వైవిధ్యానికి పుట్టిల్లు శేషాచలం. అరుదైన వృక్షాలు, వనమూలికలు, జంతువులు, కీటకాలు, పక్షులకు నిలయం. ఇక్కడి జీవవైవిధ్య విశేషాలకు విస్తృత ప్రచారం కల్పించాలనే సంకల్పంతో ఏర్పాటు చేసిన పరిశోధన కేంద్రం మూణ్నాళ్ల ముచ్చటగా మిగిలింది. ఏడేళ్లకే మూతబడి పర్యావరణహితుల ఆశలను నీరుగార్చింది.

- మంగళం, (ఆంధ్రజ్యోతి)



శేషాచల కొండల్లో గుర్తించిన స్లేండర్ కోరట్ స్నేక్



అరుదైన మొక్క సైకస్ బెడుమి

తిరుమల శేషాచల కొండలంటే గుర్తుకు వచ్చేది కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవెంకటేశ్వరస్వామి. వెనువెంటనే స్ఫురించేది ఇక్కడి జీవివైవిధ్య సంపద. అరుదైన వృక్షాలు, జంతువులు, అత్యంత విలువైన ఎర్రచందనానికి ఈ కొండలు పెట్టింది పేరు. పెర్రీత, సాంబ్రాణి వంటి 11 అరుదైన వృక్షాలు ఈ అరణ్యాల్లోనే కనిపిస్తాయి. పునుగుపిల్లి, బంగారుబల్లి, బిట్టుడుత, దేవాంగపిల్లి, అలుగు, ఎలుగుబంట్లు, ఏనుగులు, చిరుతలు, దుప్పులు, జింకలు, అడవి పందులు లాంటి ఎన్నో జంతువులు జీవిస్తున్నాయి. ఈ క్రమంలోనే శేషాచల కొండలను టైగర్స్ కారిడార్స్‌గా కూడా మార్చారు. విశేష వాతావరణమున్న ఈ జీవ వైవిధ్యంపై పరిశోధనలు జరిగితే ఎన్నో ఆసక్తికర విషయాలు వెలుగులోకి వస్తాయని 2012లో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి ప్రభుత్వం ఈ జీవవైవిధ్య పరిశోధనశాలకు దాదాపు రూ.50లక్షల బడ్జెట్ కేటాయించింది. ఏసీఎఫ్ శివరామ్‌ప్రసాద్‌ను ప్రత్యేకాధికారిగా నియమించింది. భూపేష్ గుప్తాతో పాటు మరో ఐదుగురు పరిశోధకులను నియమించింది. పరిశోధకులు భూపేష్ గుప్తా శేషాచల కొండల్లో నాగార్జున సాగర్ రేసర్, శ్రీలంక ఫ్లయింగ్ స్నేక్, స్లేండర్ కోరల్ స్నేక్, ఏలియట్ సీల్డ్‌టైల్, సర్పెంట్ ఈగల్, సైకస్ బెడుమితో పాటు ఎన్నో పుష్పాలను గుర్తించారు. వీటికి సంబంధించిన పరిశోధనలు జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. 2019 తరువాత ఉన్నట్టుండి ఈ పరిశోధనశాలను మూసివేశారు. దీంతో పరిశోధనలూ నిలిచిపోయాయి.



మూతపడ్డ శేషాచల జీవవైవిధ్య పరిశోధనశాల

ఆసక్తి చూపని అధికారులు

ఎంతో ప్రాధాన్యత, విశిష్టత ఉన్న శేషాచల జీవ వైవిధ్యాలపై పరిశోధనలకు తెరపడటం పర్యావరణ ప్రేమికులను నిరాశపర్చింది. ఎందరో ఔత్సాహికులు ఇక్కడి పరిశోధనలకు ఆసక్తి చూపిస్తున్నారు. అటవీ శాఖ అనుమతిస్తే వ్యయప్రయాసాలకోర్చయినా కొత్త విశేషాలను వెలుగులోకి తేవడానికి సిద్ధంగా ఉన్నారు. అధికారులు మాత్రం ఈ విషయంలో పెద్దగా ఆసక్తి చూపడంలేదు. గతంలో ఏసీఎఫ్ స్థాయి అధికారిని నియమించి బడ్జెట్ కేటాయించారు. ఇపుడు బడ్జెట్ లేదని అధికారులు చెబుతున్నారు. ఈ బాధ్యతలను బయోట్రిమ్‌కు అప్పగించి చేతులు దులుపుకోడానికి ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం. అలాగే ఏడాది క్రితం జంతువుల గణనకు ఇద్దరు బయాలజిస్టులను నియమించింది. వారికి వృక్ష, జంతుజాలాల పరిశోధనలతో సంబంధం లేదంటున్నారు. అటవీశాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చొరవ తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం ద్వారా గానీ, టీటీడీ పర్యవేక్షణలో గానీ పరిశోధన కేంద్రాన్ని తిరిగి ప్రారంభిస్తే శేషాచల జీవవైవిధ్యం ప్రపంచానికి పరిచయమవుతుంది.



గతంలో గుర్తించిన గుత్తి టరనుల్లా స్పైడర్

కొండంత రద్దీ



అఖిలాండం వద్ద భక్తుల రద్దీ



క్యూలో వేచి ఉన్న సర్వదర్శనం భక్తులు



సీఆర్వో వద్ద కిటకిటలాడుతున్న భక్తులు



ఆలయం ముందు...




క్యూలైన్‌లో సర్వదర్శన భక్తులు - ఉచిత బస్సులో సీట్ల కోసం భక్తుల పాట్లు



బస్సులోకి ఎక్కేందుకు ఇబ్బంది పడుతున్న భక్తులు

జీవ వైవిధ్యంపై ఎస్వీయూ విద్యార్థినికి మొదటి స్థానం

గుణ విజయ, దీప్తికి వీసీ, రిజిస్ట్రార్ల అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 24 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ జీవ వైవిధ్య మండలి - గ్రీన్ క్రాప్ సంయుక్తంగా నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో ఎస్వీ యూనివర్సిటీ విద్యార్థినికి రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం లభించింది. ఎస్వీయూ అనుబంధ మదనపల్లె జ్ఞానాంబిక డిగ్రీ కాలేజీ బీఎస్సీ బయో టెక్నాలజీ రెండో సంవత్సర విద్యార్థిని గుణ విజయ రాష్ట్ర స్థాయి పోటీలో మొదటి స్థానాన్ని పొందారు. అలాగే, పద్మావతి డిగ్రీ కాలేజీలో బీఎస్సీ జువాలజీ రెండవ సంవత్సర విద్యార్థిని దీప్తి జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచారు. వారిని ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ సీహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మాదాల భూపతి నాయుడు, కల్చరల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి అభినందించారు.

సివిల్ సర్వీసెస్ ప్రిలిమనరీ పరీక్షలకు ఏర్పాట్లు పక్కాగా ఉండాలి

- పరీక్ష కేంద్రాలను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్ మౌర్య

తిరుపతి(విద్య), మే 24(ఆంధ్రజ్యోతి): యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ ఎగ్జామినేషన్ - 2025 నిర్వహణకు ఏర్పాట్లు పక్కాగా ఉండాలని తిరుపతి మున్సిపల్ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. ఆదివారం నగరంలోని పలు కేంద్రాల్లో సివిల్ సర్వీసెస్ పరీక్ష జరుగనున్నందున శనివారం ఆమె కేంద్రాలను పరిశీలించారు. అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం, ఒత్తిడి లేకుండా పరీక్షలను నిర్వహించేలా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కాగా నగరంలో మొత్తం 13 కేంద్రాల్లో పరీక్షలు జరుగనున్నాయి. ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు రెండు సెషన్లుగా పరీక్షలు నిర్వహించనున్నారు.

సమన్వయంతో తుడా అభివృద్ధి

- చైర్మన్ దివాకర్ రెడ్డి



తిరుపతి, మే 24 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) అభివృద్ధికి అందరూ కలసికట్టుగా పనిచేద్దామని తుడా చైర్మన్ సి.దివాకర్ రెడ్డి అధికారులకు పిలుపునిచ్చారు. శనివారం తుడా వీసీ ఎన్.మౌర్య అధ్యక్షతన అన్ని విభాగాల అధికారులతో పరిచయ సమావేశం నిర్వహించారు. తుడా పరిధిలో అభివృద్ధి పనులు, ఆయా విభాగాల అధికారుల విధులను ఎన్.మౌర్య వివరించారు. చైర్మన్ మాట్లాడుతూ తుడా పరిధిలోని అన్ని విభాగాల అధికారులు అభివృద్ధికి సహకరించాలని అన్నారు. తుడా నిధులు దుర్వినియోగం కాకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు, సిబ్బందికి అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ సమావేశంలో సెక్రటరీ డాక్టర్ శ్రీకాంత్ బాబు, ఎస్ఈ కృష్ణారెడ్డి, ఈఈ రవీంద్ర పాల్గొన్నారు.

చడ్డీగ్యాంగ్‌ల కోసం రాజస్థాన్‌కు మూడు ప్రత్యేక బృందాలు

తిరుపతి(నేరవిభాగం), మే 24 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఐదేళ్ల క్రితం జరిగిన చడ్డీగ్యాంగ్‌ల దోపిడీలు, చోరీలపై జిల్లా పోలీసు అధికారులు దృష్టి సారించారు. తిరుచానూరు, ఎమ్మార్‌పల్లె, వైజాగ్ లాంటి ప్రాంతాల్లో హైటెక్ పద్ధతిలో ఈ గ్యాంగ్‌లు చోరీలకు పాల్పడ్డాయి. ఐదేళ్లుగా ఈ కేసులు పెండింగ్‌లో ఉండడంతో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి క్రైం సమీక్షా సమావేశంలో ప్రస్తావనకు వచ్చాయి. ఈ క్రమంలో బాధితులకు న్యాయం చేసేందుకు ఎస్పీ హర్షవర్ధన రాజు నిర్ణయించారు. చడ్డీ గ్యాంగ్‌లను పట్టుకోవడం కోసం తిరుపతి క్రైం పోలీసులతో ప్రత్యేక బృందాలను నియమించి, రాజాస్థాన్‌లోని దోహాద్‌కు పంపారు. అక్కడి పోలీసులతో సమన్వయం చేసుకుని గాలింపు చర్యలు చేపట్టారు. ఫింగర్ ప్రింట్‌లు, ఫొటోల ఆధారంగా వేట మొదలు పెట్టారు. శనివారం రాత్రి ఈ గ్యాంగుల్లోని ఇద్దరు పాత నేరస్థులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వారిని విచారించిన మిగిలిన వారిని పట్టుకునే దిశగా చర్యలు తీసుకుంటున్నారు.

కార్పొరేషన్‌లో ఆర్‌ఐలపై బదిలీ వేటు

తిరుపతి, మే24(ఆంధ్రజ్యోతి) : తిరుపతి నగరపాలక సంస్థలో కమిషనర్ మౌర్య ప్రక్షాళన మొదలుపెట్టారు. రెవెన్యూ విభాగంలో ఏళ్లతరబడి పాతుకుపోయిన ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ శనివారం ఉత్తర్వులు ఇచ్చారు. రెవెన్యూ అధికారి సేతుమాధవ్ పరిధికి సంబంధించి మేయర్ పీఏగా ఉన్న హరిమోహన్, హెల్త్ సెక్షన్‌లో పనిచేసే ఎస్ఎండీ రఫీ, సీనియర్ అసిస్టెంట్లు కె.నరేష్, ఎం.కృష్ణమూర్తి, టైపిస్ట్ నవీన్‌లు అర్‌ఐలుగా నియమితులయ్యారు. మరో ఆర్వో రవి పరిధిలో టైపిస్ట్ పి.మునిరత్నం రెడ్డి, జూనియర్ అసిస్టెంట్లు ఆర్.కరుణాకర్, పి.మోహన్, ఎస్.పావనిలను బదిలీ చేశారు. ప్రస్తుతం పనిచేస్తున్న ఆర్‌ఐలకు ఎలాంటి బాధ్యతలు అప్పగించలేదని తెలిసింది.

వచ్చే నెలకు ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి



హౌసింగ్ చీఫ్ జనరల్ మేనేజరు అన్నపూర్ణ

తిరుపతి(కలెక్టరేట్), మే 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జూన్ మొదటి వారానికి 14,001 గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని హౌసింగ్ అధికారులను ఆ శాఖ జిల్లా స్పెషల్ ఆఫీసర్ అన్నపూర్ణ ఆదేశించారు. గృహ నిర్మాణాలపై కలెక్టరేట్‌లో శనివారం ఆశాఖ అధికారలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూన్ 10 నాటికి జిల్లాలో 14,001 గృహాలను ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలన్నారు. ఇప్పటికే జిల్లాలో 5,468 మంది (ఎస్సీ, ఎస్టీ, బీసీ) లబ్ధిదారులకు అదనపు ఆర్థికసాయం అందజేశామన్నారు. ఆ ఇళ్ల నిర్మాణాలు వెంటనే పూర్తయ్యేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయని వారికి నోటీసులు అందజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా హౌసింగ్ అధకారి దయాకర్, ఈఈ శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సీఐఐ ప్రాజెక్టుతో అభివృద్ధి పథంలో రాష్ట్రం

- పారిశ్రామికవేత్తల శిక్షణ కార్యక్రమంలో మంత్రి శ్రీనివాస్



తిరుపతి(వైద్యం), మే 24(ఆంధ్రజ్యోతి): సీఐఐ ప్రాజెక్టుతో రాష్ట్రంలో పరిశ్రమలు పెరిగి స్వర్ణాంధ్రప్రదేశ్‌గా అభివృద్ధి చెందడానికి అవకాశం ఏర్పడుతుందని ఎంఎస్ఎంఈ, ఎస్ఈఆర్పీ, ఏఆర్ఐ సాధికారత, సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. మానస సరోవర్ హోటల్లో శనివారం సీఐఐ తిరుపతి వారు ఏర్పాటుచేసిన పారిశ్రామికవేత్తల రెండు రోజుల శిక్షణా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పరిశ్రమలతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యపడుతుందనే దృఢమైన ఆలోచనతో సీఎం చంద్రబాబు రాష్ట్రంలోని 11 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు, ప్లాటడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లను ప్రారంభించారన్నారు. 2047 నాటికి వార్షిక వృద్ధి రేటు 15 శాతం కంటే ఎక్కువగా సాధించే దిశగా చర్యలు చేపడుతున్నారని వివరించారు. కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ పరిశ్రమలకు జిల్లా ఎంతో అనువైందన్నారు. విమానాశ్రయంతోపాటు రెండు పోర్టులు, రెండు జంక్షన్ రైల్వేస్టేషన్‌లు ఉన్నందున పరిశ్రమల నిర్వహణ, రవాణా సులభతరంగా ఉంటుందన్నారు. తిరుపతిలో ఎంఎస్ఎంఈలు 2.5 లక్షల ఉద్యోగాలను సృష్టిస్తున్నాయని తెలిపారు. సీఐఐ రాష్ట్ర వైస్ చైర్మన్ నరేంద్ర కుమార్ మాట్లాడుతూ దేశంలో 2030 నాటికి ఏటా 7.85 మిలియన్ల వ్యవసాయేతర రంగాల ఉద్యోగాలను సృష్టించాలన్నారు. అనంతరం పరిశ్రమల ఆవిష్కరణలను మంత్రి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఐఐ తిరుపతి చైర్మన్ జగన్నాథ్ అనిరుధ్, సీఐఐ రాష్ట్ర మాజీ చైర్మన్ విజయ్‌నాయుడు గల్లా, తిరుపతి వైస్ చైర్మన్ రాజేంద్రన్, సీఐఐ ప్రతినిధులు శ్రీనివాస్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా సీపీఎల్

తిరుపతి(క్రీడలు), మే 24(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్వీయూ తారకరామ స్టేడియంలో సీపీఎల్ మ్యాచ్‌లు హోరాహోరీగా జరుగుతున్నాయి. శనివారం ఉదయం జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఆదిత్య లెవెన్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 172పరుగులు చేసింది. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన రాయల్‌ఛాలెంజ్ తిరుచానూరు జట్టు 18.1ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 175పరుగులు చేసి విజయకేతనం ఎగురవేసింది. ఈ జట్టుకు చెందిన శశాంక్ కేవలం 19బంతుల్లో 56 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందుకున్నాడు. అతిథులు సురేందర్‌రెడ్డి, శ్రీధర్, సతీష్‌యాదవ్‌లు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ప్రదానం చేశారు. అలాగే మధ్యాహ్నం జరిగిన మ్యాచ్‌లో స్పోర్టర్ వారియర్స్ జట్టు నిర్ణీత 20ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 171పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన హైపిరియన్ జట్టు 4.1ఓవర్లు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించింది. బ్యాటింగ్‌లో రాణించి విజయానికి బాటవేసిన హర్షరెడ్డిని మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డుకు ఎంపికచేయగా అతిథులు డాక్టర్ సాజిత్, మురళీ యాదవ్ అందజేశారు.

ఏకుదారం పుస్తకావిష్కరణ



తిరుపతిరూరల్, మే24(ఆంధ్రజ్యోతి): ఎంఆర్‌పల్లె లోని యూత్ హాస్టల్‌లో అనంతపురానికి చెందిన రచయిత డాక్టర్ బి.నాగేశ్వరరావు రచించిన ఏకుదారం పుస్తకాన్ని శనివారం ఆవిష్కరించారు. ఎస్వీయూ ప్రాచ్య పరిశోధనాసంస్థ డైరెక్టర్ ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు ఈపుస్తకాన్ని ఆవిష్కరించగా రచయిత ఆర్‌సీ కృష్ణస్వామిరాజు తొలిప్రతిని అందుకున్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన కథ, నవల రచయిత డాక్టర్ వీఆర్ రాసాని, పీసీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈనవలలో రచయిత నాడీస్పందన ఆద్యంతం కనిపిస్తోందన్నారు. పద్మావతి వర్సిటీ అధ్యాపకురాలు డాక్టర్ వై.సుభాషిణి మాట్లాడుతూ కులవృత్తిదారులు ప్రపంచీకరణలో కొట్టుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బొమ్మిశెట్టి రమేష్ మాట్లాడుతూ జీవితంలో కష్టాలు ఎదురైనప్పుడు ఆత్మపరివర్తన, ఆత్మహత్య అనే రెండుమార్గాలు ఉంటాయని, వీటిలో రచయిత ఆత్మపరివర్తన దిశగా వెళ్లి అత్యద్భుతంగా అభివృద్ధి చెందారని వివరించారు. సమీక్షకులుగా వ్యవహరించిన డాక్టర్ కె.శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ స్థలం, కాలం, చలనం గురించి ఈ పుస్తకంలో స్పష్టంగా ఉందన్నారు. రచయితలు ఆకుల మల్లేశ్వరరావు, పేరూరు బాలసుబ్రమణ్యం, మారిశెట్టి గోవిందు, డాక్టర్ యువశ్రీ, అమరేంద్ర, నాగార్జునశర్మ, కొండారెడ్డి, ముద్రణకర్త మంజునాథ, భాషాభిమానులు, కవులు పాల్గొన్నారు.

టెన్త్‌లో నారాయణ విద్యార్థినికి 2వ ర్యాంకు

- పునర్మూల్యాంకనంలో 600లకు 599 సాధించిన విద్యార్థిని హృతి



హృతిని అభినందిస్తున్న డీజీఎం కొండలరావు, ఏజీఎం డాక్టర్ శ్రీనివాసులు

తిరుపతి(విద్య), మే 24(ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన నారాయణ విద్యాసంస్థల విద్యార్థిని జి.హృతి 10వ తరగతి పునర్మూల్యాంకనంలో రాష్ట్రస్థాయిలో ద్వితీ య ర్యాంకును సాధించింది. ఎం.ఆర్.పల్లిలోని నారాయణ ఒలింపియాడ్ పాఠశాలకు చెందిన హృతి పదవ తరగతి ఫలితాల్లో మొదట 596 మార్కులు సాధించింది. ఇంగ్లిష్‌లో 97 మార్కులు సాధించింది. ఐతే ఇంగ్లిష్ పేపర్ పునర్మూల్యాంకనం కోసం దరఖాస్తు చేసుకుంది. శనివారం ఫలితాలు వెలువడగా 100 మార్కులు వచ్చాయి. దీంతో హృతి మొత్తం 599 మార్కులతో రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా విద్యాసంస్థల డీజీఎం కొండలరావు, ఏజీఎం డాక్టర్ శ్రీనివాసులు, ప్రన్సిపాల్ మధు చంద్రుడు, ఆర్ఐ జీవీఎస్ కుమార్ విద్యార్థినిని అభినందించారు.

స్టేడియంలో ఓపెన్ జిమ్ ఏర్పాటుకు చర్యలు


స్టేడియాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. గురువారం స్టేడియంలో జిమ్ ఏర్పాటుకు స్థలాన్ని, డ్రైనేజీ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్టేడియంలో క్రీడాకారులకు, వాకర్స్‌కు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తామన్నారు. దాతల సహకారంలో ఇండోర్ జిమ్ ఏర్పాటు చేశామని, త్వరలోనే పెన్వర్ కంపెనీ సహకారంతో ఓపెన్ జిమ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమీపంలోని ఆస్పత్రి డ్రైనేజీ నీరు స్టేడియంలోకి రాకుండా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి రూ.17లక్షలు నిధులు మంజూరు చేయించి డ్రైనేజీ నిర్మాణాలను ప్రారంభించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో గంటా మధుకృష్ణ, వేగూరు రాజేంద్రప్రసాద్, నిమ్మకాయల రవి, థామస్, శేఖర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రాల ద్వారా ప్రత్యేక విద్య


సర్వేలో పిల్లలను గుర్తిస్తున్న జిల్లా సహిత విద్య కో ఆర్డినేటర్ చంద్రశేఖర్ రెడ్డి, పక్కన ఎంఈవో శ్రీనివాసులురెడ్డి, సిబ్బంది సాయి సంధ్య

సూళ్లూరుపేట, మే 24 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాల గల పిల్లలకు భవిత కేంద్రాల ద్వారా ప్రత్యేక విద్య అందిస్తున్నామని జిల్లా సహిత విద్య కో ఆర్డినేటర్ చంద్రశేర్ రెడ్డి అన్నారు. సూళ్లూరుపేటలో ఈనెల 13నుంచి ప్రత్యేక అవసరాల గల పిల్లలను గుర్తించే సర్వే చేపట్టారు. ఈ సర్వేను శనివారం ఆయన పరిశీలించి సిబ్బందిని వివరాలడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చంద్రశేర్ రెడ్డి మాట్లాడుతూ భవిత కేంద్రాల ద్వారా ప్రత్యేక అవసరాల గల పిల్లలకు ప్రత్యేక విద్యను అందుబాటులోకి తీసుకురావడమే కాకుండా వారికి ఉచితంగా ఉపకరణాలు, అలవెన్సులు అందిస్తున్నామన్నారు. ప్రత్యేక అవసరాల గల పిల్లలు వ్యక్తిగత నైపుణ్యాలు, మానసిక వికాసం అభివృద్ధి చెంది సాధారణ విద్యార్థులవలే పదో తరగతి పరీక్షలు రాసి ఉత్తీర్ణలయ్యారన్నారు. ఇందులో భాగంగానే ఈ నెల 13నుంచి జూన్ 6 వరకు ఇంటింటా తిరిగి ప్రత్యేక అవసరాల గల పిల్లలను గుర్తించి వారిని భవిత కేంద్రంలో చేర్పించేందుకు సిబ్బంది కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసులురెడ్డి, భవిత కేంద్ర ఉపాధ్యాయురాలు సాయి సంధ్య పాల్గొన్నారు.

రోబోటెక్ వైద్యసేవలు ప్రారంభం


రోబోటెక్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, మే 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలో సుమన్ డెంటల్ ఆస్పత్రిలో రోబోటెక్ వైద్యసేవలను ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటగిరి పట్టణంలో అధునాతన టెక్నాలజీతో రోబోటెక్ డెంటల్ సేవలు అందుబాటులోకి రావడం శుభ పరిణామమని చెప్పారు. సుమన్ డెంటల్ ఆస్పత్రిలో 9 బెటాలియన్‌తో పాటు సివిల్ పోలీసులకు ఆరోగ్య భద్రతా కార్డు ద్వారా ఉచిత వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో గంగోటి నాగేశ్వరరావు, దొంతు శారద, పులికొల్లు రాజేశ్వరరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, పునుగోటి విశ్వనాధనాయుడు, బీరం రాజేశ్వరరావు, దొంతు బాలకృష్ణ, పప్పు చంద్రమౌళిరెడ్డి, అవ్వారు సత్యనారాయణ, కాపా శ్రీనివాసులు నాయుడు, వెంకటముని, మంకు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు కౌన్సెలింగ్

కోట, మే 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడులో గల యానాదుల బాలుర గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రవేశాలకు శనివారం కౌన్సెలింగ్ జరిగింది. ప్రిన్సిపాల్ శేషవర్ధన్ ఆధ్వర్యంలో ఉమ్మడి నెల్లూరు, తిరుపతి జిల్లా విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎంపీసీలో 9, బైపీసీలో 7, హెచ్ఈసీలో 3మంది విద్యార్థులకు మెరిట్ ప్రాతిపదికన ప్రవేశం కల్పించారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న వాహనం

సూళ్లూరుపేట, మే 24 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలోని కావలి వీధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఎదురుగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని శనివారం గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో స్తంభం విరిగిపోయి తీగలు తెగిపోవడంతో సూళ్లూరు, నాగరాజపురం ప్రాంతాలకు దాదాపు 3 గంటల పాటు సరఫరా ఆగిపోయింది. విద్యుత్‌శాఖ సిబ్బంది కొత్త స్తంభం ఏర్పాటు చేసి విద్యుత్‌ను పునరుద్ధరించారు.

కోట డీటీగా మల్లికార్జునరావు

కోట, మే 24(ఆంధ్రజ్యోతి): కోట మండల డిప్యూటీ తహసీల్దారుగా మల్లికార్జున్‌రావును నియమితులయ్యారు. గతంలో ఇక్కడ డీటీగా పనిచేసిన మల్లికార్జునరావు కొద్దినెలల సివిల్ సప్లయ్స్ డీటీగా బదిలీ అయ్యారు. ప్రస్తుతం మల్లికార్జునరావునే కోట మండల డీటీగా నియమించారు. ఇక్కడి డీటీ హజ్మతుల్లాఖాన్‌ను సివిల్ సప్లయ్స్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు అందినట్లు తహసీల్దారు జయజయరావు తెలిపారు.

ప్రారంభించి.. తాళం వేసేశారు!

నిరుపయోగంగా అగ్రి టెస్టింగ్ ల్యాబ్


వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో నిర్మించిన అగ్రి టెస్టింగ్ ల్యాబ్

సూళ్లూరుపేట, మే 24 (ఆంధ్రజ్యోతి): రైతులకు అందించే విత్తనాలు, ఎరువుల్లో నకిలీ భూతాన్ని అరికట్టేందుకు గత ప్రభుత్వ హయాంలో నిర్మించి ప్రారంభించిన అగ్రి టెస్టింగ్ ల్యాబ్ నేటికి అందుబాటులోకి రాలేదు. సూళ్లూరుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో గత ప్రభుత్వ హయాంలో నియోజకవర్గ స్థాయి అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను రూ.78.25 లక్షల నాబార్డు నిధులతో నిర్మించారు. 2023 జూలై 7న ల్యాబ్‌ను ఆర్భాటంగా ప్రారంభించారు. ఆ మరుసటి రోజే భవనానికి తాళం వేసేశారు. ఆ తరువాత అధికారులు ఎవరూ అటువైపు కన్నెత్తి చూడలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ల్యాబ్‌ను రైతులకు అందుబాటులోకి తెస్తారని రైతులు ఆశలు పెట్టుకున్నారు. అయితే దాదాపు ఏడాది కావస్తున్నా అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌కు తాళం తీయలేదు. ఇటీవల ఈ ల్యాబ్‌కు ఒక అధికారిని నియమించారు. కానీ యంత్ర పరికరాలు, సిబ్బందిని నియమించలేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవతీసుకుని నిరుపయోగంగా ఉన్న అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను అందుబాటులోకి తేవాలని రైతులు కోరుతున్నారు.

ఆదాయ వనరులున్నా సద్వినియోగం చేసుకోలేమా?

మున్సిపల్ సమావేశంలో కౌన్సిలర్ల ప్రశ్న ● వార్డుల్లో అభివృద్ధి జరగట్లేదని ఆవేదన


సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, కౌన్సిలర్లు

వెంకటగిరి టౌన్, మే 24(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి మున్సిపాలిటీకి ఆదాయ వనరులున్నా సద్వినియోగం చేసుకోవడంలో పాలకవర్గంతో పాటు అధికారులు విఫలమవుతున్నారని 14వ వార్డు కౌన్సిలర్ శంకరయ్య అన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకరయ్య మాట్లాడుతూ మున్సిపాలిటీలో ఎన్నో ఆదాయ వనరులు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకో లేకపోతున్నామని, కార్మికులకు జీతాలు కూడా నెలనెలా ఇవ్వలేని పరిస్థితుల్లో పాలవర్గం ఉందని చైర్‌పర్సన్, కమిషనర్‌లను నిలదీశారు. మున్సిపాలిటీ ఆస్తులను పరిరక్షించడంలో అధికారులపై విఫలమయ్యారని మండిపడ్డారు. 4వ వార్డు నారాయణ మాట్లాడుతూ వార్డులో కుక్కలు బెడద ఎక్కువగా ఉందని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోక పోవడం సిగ్గుచేటన్నారు. వార్డులో అభివృద్ధి పనులు చేపట్టక పోవడంతో ప్రజలు నిలదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వార్డులో తిరగాలంటే సిగ్గుగా ఉందన్నారు. 16వ వార్డు కౌన్సిలర్ రాధ మాట్లాడుతూ బఫర్ జోన్‌లో నిర్మాణాలు చేపడు తుంటే అధికారులు పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కౌన్సిల్ ఆమోదం లేకుండా అధికారులే అనుమతులు ఇస్తుంటే పాలకవర్గం ఎందుకని ప్రశ్నించారు. ఈ సందర్భంగా కమిషనర్‌కు కౌన్సిలర్లుకు వాగ్వాదం చోటుచేసుకుంది. ఇంతలో కౌన్సిలర్లు ఒక్కొక్కరుగా వెళ్లిపోయారు.

గిరిజనుల సంక్షేమానికి పెద్దపీట: విజయశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ

నాయుడుపేట టౌన్, మే 24 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గిరిజనుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నట్లు సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. పట్టణంలోని వెలుగు కార్యాలయంలో శనివారం బాలజ్యోతి రూరల్ డవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో గిరిజన సంక్షేమంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే నియోజకవర్గంలోని గిరిజన కాలనీల్లో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. నూతనంగా రూ.18 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళికను రూపొందించడం జరిగిందన్నారు. ముఖ్యంగా గిరిజనుల కోసం రోడ్లు, తాగునీటి వసతి తదితర కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు వెల్లడించారు. గిరిజనులు కూడా విద్యావంతులు కావాలన్నా లక్ష్యంతో విద్యకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. గిరిజనులకు ఏమైనా ఇబ్బందులు ఉంటే గ్రీవెన్స్‌లో అర్జీలు అందజేస్తే పరిష్కారం చూపుతామన్నారు. పక్కాగృహాలు, తాగునీటి వసతి కల్పించాలని ఎమ్మెల్యేకి గిరిజనులు వినతిపత్రం అందజేశారు. సమావేశంలో ఎంపీడీవో సురేష్‌బాబు, మండల ప్రత్యేక అధికారి గోవర్ధన్‌రెడ్డి, ఎంఈవో మునిరత్నం, సీడీపీవో ఉమామహేశ్వరి, ఏపీఎం ఉమాదేవి, ఐటీడీఏ జాన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీసిటీ ఉద్యోగిపై కత్తితో దాడి

సూళ్లూరుపేట, మే 24 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట తహసీల్దార్ కార్యాలయ సమీపంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు శ్రీసిటి ఉద్యోగి వెంటక శివపై కత్తితో దాడిచేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు... ప్రకాశం జిల్లా మార్కాపురం మండలం తిమ్మయ్యపాలెం గ్రామానికి చెందిన వెంకట శివ శ్రీసిటి సెజ్‌లో ఓ పరిశ్రమలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. సూళ్లూరుపేటలోని షార్ బస్టాండు సమీపంలో స్నేహితులతో కలిసి గదిలో ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో తన స్నేహితుడిని రైలు ఎక్కించేందుకు వెళ్లి తిరిగి వస్తుండగా తహసీల్దార్ కార్యాలయ వెనుక వైపుననున్న దారిలో నుంచి ఇద్దరు వ్యక్తులు స్కూటీపై వచ్చి డబ్బులు ఇవ్వమని బెదిరించారు. తన వద్ద ఏమిలేదని చెప్పడంతో కత్తితో దాడిచేశారు. గాయపడిన వెంకటశివ అపస్మారకస్థితిలోకి వెళ్లడంతో దాడిచేసిన వ్యక్తులు పరారయ్యారు. కొద్దిసేపటి తరువాత తేరుకొన్న వెంకట శివ ఫోన్ ద్వారా స్నేహితులకు సమాచారం ఇచ్చాడు. వెంటనే స్నేహితులు వచ్చి గాయపడిన శివను ప్రైవేట్ వాహనంలో నెల్లూరుకు తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు శనివారం బాధితుడి నుంచి వివరాలు సేకరించారు. అదేరోజు రాత్రి రైల్వేగేటు సమీపంలోని వైన్‌షాపు వద్దనున్న వాచ్‌మెన్ సురేష్‌పై ఇద్దరు వ్యక్తులు దాడిచేసేందుకు ప్రయత్నించినట్లు తెలిసింది. ఈ రెండు ఘటనలపై పోలీసుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించేందుకే ఐడియా ల్యాబ్

గూడూరు అర్బన్, మే 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించేందుకు ఐడియా ల్యాబ్ దోహదపడుతుందని నారాయణ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవిప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో ఐడియా ల్యాబ్‌ను ఏర్పాటు చేసేందుకు ఏఐసీటీఈ అనుమతి ఇచ్చిందన్నారు. ఐడియా ల్యాబ్ ద్వారా విద్యార్థులను ఉత్సాహకంగా, సృజనాత్మకంగా తీర్చిదిద్దడంతో పాటు విమర్శనాత్మక ఆలోచన, కమ్యూనికేషన్ పెంపొందించుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ దత్తాత్రేయశర్మ, విశ్వక్సేనారెడ్డి, బీవీ కృష్ణయ్య, ఏవో కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి హుండీ లెక్కింపు

చిల్లకూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి హుండీ ఆదాయాన్ని శనివారం ఆలయ ప్రాంగణంలో లెక్కించారు. ఆరు నెలల్లో రూ.1,39,809 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో రవికృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ నెల్లటూరు చిరంజీవి, స్థానికులు పాల్గొన్నారు.

కమనీయం రాములోరి కల్యాణం


సీతారాముల కల్యాణం జరుపుతున్న వేదపండితులు

కోట, మే 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలిలోని అభయాంజనేయస్వామి ఆలయంలో శనివారం సీతారాముల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా సీతారామ ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆ సంస్థ ప్రతినిధి అనంతాచార్యులు పర్యవేక్షణలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామివారి కంకణాలు, తలంబ్రాలు, తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

మద్యం దుకాణదారులు నిబంధనలు పాటించకుంటే చర్యలు

గూడూరు అర్బన్, మే 24 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణ దారులు నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకుంటామని జిల్లా ప్రొహి బిషన్, ఎక్సైజ్ అధికారి నాగమల్లేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం గూడూ రు పట్టణ, రూరల్ పరిధిలోని పలు మద్యం దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం దుకాణ దారులు సమయపాలన పాటించాలని స్పష్టం చేశారు. అదేవిధంగా దుకాణాల చుట్టుపక్కల ప్రాంతాల్లో, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట అసిస్టెంట్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఉషాశ్రీ, సిబ్బంది ఉన్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

బాలాయపల్లి, మే 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నూరు మిట్టలో బెల్టుదుకాణంపై శనివారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఎనిమిది మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకుని నిందితుడు క్రాంతిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి


సదస్సులో మాట్లాడుతున్న సివిల్ జడ్జి విష్ణువర్మ

వెంకటగిరి టౌన్, మే 24(ఆంధ్రజ్యోతి): చట్టాలపై ప్రతి ఒకరూ అవగాహన కలిగి ఉండాలని వెంకటగిరి సివిల్ జడ్జి విష్ణువర్మ అన్నారు. శనివారం మండల పరిధిలోని వల్లివేడులో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళ కోసం ప్రత్యేక చట్టాలు ఉన్నాయని, వాటి గురించి అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ రమణ, న్యాయవాదులు సుంకర రాజేష్, రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి అభిషేకాలు

చిల్లకూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చిల్లకూరులోని అభయాంజనేయస్వామికి శనివారం హనుమజ్జయంతిని పురస్కరించుకుని అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా తమ్మినపట్నం గ్రామంలోని వీరాంజనేయస్వామి ఆలయంలో స్వామివారిని చందనంతో అలంకరించారు. తమలపాకులతో ఆకుపూజ, విశ్వక్సేన పూజ, పూర్ణాహుతి నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

యమదిన్నెపాళెంలో వైద్య శిబిరం


రోగికి సంబంధించి ఎక్సరేని పరిశీలిస్తున్న డాక్టర్

కోట, మే 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్తపట్నం పంచాయతీ యమదిన్నెపాళెంలో శనివారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. డాక్టర్ దినేష్, డాక్టర్ శివశంకర్ గ్రామంలో కీళ్లు, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్న వారికి చికిత్స చేసి మందులు పంపిణీ చేశారు. స్థానికులు తాగుతున్న నీరు, తీసుకుంటున్న ఆహారాన్ని పరిశీలించి అవగాహన కల్పించారు. ప్రతి ఇంటికీ వెళ్లి రక్తం, షుగర్, బీపీ పరీక్షలు చేశారు. టీడీపీ మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు తిరుమూరు మురళి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అల్లాబక్షు, ఏఎన్ఎంలు నాగమణి, భువనేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన స్థలానికి దారి ఇవ్వండి

బాలాయపల్లి, మే 24 (ఆంధ్రజ్యోతి) మండలంలోని కాట్రగుంట గ్రామంలో శ్మశాన స్థలానికి దారి చూపాలని గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు మొర పెట్టుకున్నారు. శనివారం కాట్రగుంట గ్రామంలోని చెరువు చివర ఉన్న శ్మశానాన్ని పరిశీలించిన తహసీల్దార్ విజయలక్ష్మి రైతులతో చర్చించారు. శ్మశాన స్థలానికి దారి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీకాంత్, సర్వేయర్ తారకరామారావు, వీఆర్వో మేకలయ్య, నాయకులు మారెళ్ల వెంకటాద్రి పాల్గొన్నారు.

చిట్టేడు గురుకులంలో తనిఖీలు

కోట, మే 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడు యానాదుల గురుకుల పాఠశాలను శనివారం జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ గౌరీ శంకర్ తనిఖీ చేశారు. గురుకులంలో నిర్మిస్తున్న కెమిస్ట్రీ ల్యాబ్, కిచెన్ హెడ్, క్రీడా కోర్టులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గిరిజన గురుకులాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తోందన్నారు. ఆయన వెంట ఏఎంవో శివశంకర్, ఎంఈవో మస్తానయ్య, ప్రిన్సిపాల్ తదితరులు ఉన్నారు.


గురుకులంలో కెమిస్ట్రీ ల్యాబ్ స్థలాన్ని పరిశీలిస్తున్న సమగ్ర శిక్షా అభియాన్ ఏపీఓ గౌరీ శంకర్

వైభవంగా సుదర్శన హోమం


హోమం నిర్వహిస్తున్న వేధపండితులు

సూళ్లూరుపేట, మే 24 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని బాలాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం సుదర్శన హోమం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని యాగశాల మండపంలో స్వామివారి ఉత్సవ మూర్తులకు వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ యాగం నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమంతుడు అభయాంజనేయస్వామి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వాకచర్ల రమేష్, బట్టా సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు


టీడీపీలో చేరిన వైసీపీ నేతలతో తానంకి నానాజీ, పట్టాభిరామిరెడ్డి, రామచంద్రారెడ్డి తదితరులు

చిల్లకూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరుకు పలువురు వైసీపీ నేతలు శనివారం టీడీపీలో చేరారు. వైసీపీ నేతలు పిళ్లెళ్ల సురేష్, కాటూరు శ్రీహరి, గొత్తల ఆకాష్, వీరబోయిన కిషోర్, కాటూరు చంద్రశేఖర్ టీడీపీ సీనియర్ నాయకుడు తానంకి నానాజీని ఆయన నివాసంలో కలిసి పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, కొండా రామచంద్రారెడ్డి, దాసరి రాము, నవీన్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.